జూలై - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

**గౌరవ సంపాదకులు :**

**కె. సామ్యేల్ రాజేంద్ర**

**సంపాదకులు :**

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

**చందా వివరాలు :**

సంవత్సర చందా రూ. 350/-
పోషక చందా రూ. 1500/-
జీవితచందా రూ. 5000/-

**చిరునామా :**


ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లౌపేట, 6వలైను
ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా
సెల్ : 9866716506

**బ్యాంక్ అకౌంట్ వివరాలు :**


A/c Name: **K. Samuel Rajendra**
A/c No.: **10957294362**
Bank: SBI Main Branch, Ongole
IFSC Code : SBIN0000890

## విషయసూచిక

| | | |
|---|---|---|
| సంపాదకీయం ఎడిటర్ | | 02 |
| జప్పుత్పనేహు | కొడవటికంటి | 03 |
| ఆరోగ్యమే మహా శాపము.... | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| మిక్కిలి సాత్వికుడు | కొడవటికంటి | 07 |
| దేవుడు-సిరి | | 09 |
| ఘనురాలు | | 10 |
| దేవుడు నిన్ను నడిపిస్తాడు.... | ఇమ్మానియేలు రాజేంద్ర | 12 |
| సాక్ష్యము | చంద్రకుమారి | 13 |
| ఏలీయా | చిన్నపిల్లల కథ | 17 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| సాక్ష్యము | ఈదర యేసుదాసు | 20 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |
| పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక | | 24 |



# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు వ్యవస్థాపకుడు కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

రాజుల గ్రంథములో యూదా, ఇశ్రాయేలు రాజులలో ఏ రాజు హిజ్కియా అంత గొప్ప విశ్వాసి కాదు, బైబిలే సాక్షి. అటువంటి హిజ్కియా యొక్క ఆయుష్షును దేవుడు ఆపి అతనికి తెలియపరచాడు. హిజ్కియా వెంటనే దేవునికి యథార్థంగా ప్రార్థించగా, దేవుడు తన మనస్సును మార్చుకొని హిజ్కియాను మరణమునకు అప్పగించక 15 సం॥ల ఆయుష్షును ఇచ్చాడు. హిజ్కియా కుమారుడైన మనష్షే వలన ఎంత మంది దేవుని బిడ్డలు అల్లాడతారో దేవునికి తెలుసు. హిజ్కియాను చంపటం చంపకపోవటం దేవుని చేతిలో పని.

అలాంటప్పుడు దేవుడు ఎందుకు మనష్షేను పుట్టించాలి? యెషయా ప్రవక్తను ఎందుకు చెక్కరంపంతో కోయించాలి? తరువాత మనష్షే జైలులో ఉండి మారుమనస్సు పొందినప్పటికి , దేవుడు ఇష్టములేకయే క్షమించెను. "అతడు (మనష్షే) నిరపరాధుల రక్తముతో యెరూషలేమును నింపినందున అది క్షమించుటకు యెహోవాకు మనస్సు లేకపోయెను" 2రాజులు 24:4. ఇప్పుడు మన జీవితాలలో కూడా దుర్మార్గులు వికసించి జీవించుట, దేవుని బిడ్డలు కష్టాలు పడటం చూస్తున్నాం. దేవుడు ఈవిధంగా ఎందుకు చేస్తున్నాడు? అని అనుకుంటాం. కానీ దైవగ్రంథంలో దేవునికి ఇవ్వబడిన బిరుదులన్నిటిలో ముఖ్యమైనది, ఎక్కువసార్లు చెప్పబడినది ఆయన 'న్యాయాధిపతి'. "ఏలయనగా న్యాయము చేయుట యెహోవానగు నాకిష్టము" యెషయా 61:8. బైబిలు గ్రంథంలోని మానవ చరిత్రలన్నీ యథార్థము. దేవునిచే తూకం వేయబడినవి.

ఇందునుబట్టి మన జీవితాన్ని మనం దేవుని సన్నిధిలో తూకం వేసుకుంటే హిజ్కియావలె దేవునికి ఇష్టం లేని పనులు చేసినా, మనష్షే వలె దుర్మార్గమైన పనులు చేసినా, యోషీయా వలె (ఫరోనెకో మీదకు యుద్ధానికి వెళ్ళడం) పొరపాటు చేసినా దేవుడు పొరపాటు చేయడు. నాజీవితంలో జరిగినవన్నీ నాకు తెలిసేయున్నవి. యథార్థమైన హృదయంతో నాకు ఇష్టములేని బాధకరమైన పరిస్థితులన్నీ దేవునిచే ఇవ్వబడినవే అని నేను గ్రహించినప్పుడు దేవుడు ఎంత న్యాయవంతుడు అని అనిపిస్తుంది. అందుకుగాను వివేచన, యోచన దేవుడు మన హృదయాలలో పుట్టించును గాక!

–కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

**K. Samuel Rajendra, SBI Collector Office Branch, Ongole**
**A/c No. 10957294362**

సీరియల్

# జఫ్నత్పనేహు

3

(యోసేపు జీవితచరిత్ర)

– కొడవటికంటి

యెబూసు పట్టణం ఎంతో ఎత్తులో కట్టబడింది. మిద్దె మీద నుండి చూస్తే దూరంగా పదిమైళ్ళకు పైగా దూరంలో ఉన్న లోయలు ఎంతో లోతైనవి. అరమైలు లోతులో ప్రవహించే యోర్దాను నది మీద నుండి సూర్యుడు పైకి లేచినట్లుగా ఉంటుంది. యెబూసుకు ఉత్తరంగా మొదలయ్యే లోయ, తూర్పుగా తిరిగి ఒలీవ కొండమీదుగా పోతుంది. దక్షిణంగా లోయలు ఉన్నాయి. హిన్నోము లోయలు – ఒలీవకొండకు, యెబూసు కొండకి మధ్యలో ఉండే లోయని 'కెద్రోను వాగు' అని అంటారని తన తండ్రి షెకెము నుండి వచ్చేటప్పుడు చెప్పాడు. ఆ వాగులో నీళ్ళులేవు.

ఇంకా దాదాపు ముప్పై నాలుగు మైళ్ళు వెళ్తే కాని షెకెము చేరలేము. సాయంకాలంలోపు చేరాలంటే వెంటనే బయలు దేరాలి. ఐగుప్తు మీద తనకు నమ్మకముంది. ఎట్టి పరిస్థితిలోను ఎదురు తిరగదు, మారాం చెయ్యదు. రాత్రి నుంచి ఆహారం ఇచ్చారు, నీరు బాగానే త్రాగింది. రాత్రి పూర్తి విశ్రాంతి దొరికింది. ఇంతదూరం ప్రయాణం చెయ్యటం ఇదే మొదటి సారైనా ఎటువంటి ఇబ్బంది లేకుండానే ప్రయాణం సాగింది.

ఇంటివారితో మాట్లాడి బయలుదేరుతుంటే ఇంటి యజమాని ఊరి గవిని దాకా వచ్చి సాగనంపాడు. లేకపోతే ఊరి గవిని యొద్ద కొంత ఆలస్యం అయ్యేది గవిని పెద్దలకు, వివరాలు చెప్పి బయలుదేరటం ఆనవాయితి. పది గడియల ముందే గిల్గాలు వెళ్ళే వర్తకులు ఐగుప్తు నుండి గిల్గాలు వైపుగా వెళ్ళారని విన్నాడు. వారిని కలుసుకుంటే తోడు ఉంటుంది అనుకున్నాడు. దారిలో దొంగల భయం లేకపోయినా, ఫలవంత మైన ఈ పల్లపు భూమిలో అరణ్యాలు ఎక్కువైనందువల్ల క్రూర జంతువులు ఒంటరివారికి అపాయం కలిగిస్తాయి. ఈ ఇష్మాయేలీయులు ఐగుప్తులో నివసించేవారు. ఐగుప్తు దగ్గర నివసించేవారే కాని, వ్యాపారం అంటే గిల్గాలు నుండి నజరేతు మీదుగా గలిలయ ప్రాంతంలో వ్యాపారం చేస్తుంటారు.

యోసేపు మొదటిజామున గడిచేటప్పటికి బేతేలు చేరాలని ఆశపడ్డాడు. ఎందుకంటే అక్కడ తన ప్రియమైన 'దాది' దెబోరా సమాధి ఉంది. అక్కడ తండ్రికి మొట్ట మొదటి సారి సర్వశక్తుడు దర్శమిచ్చాడు. షెకెములో తమ కుటుంబానికి జరిగిన అవమానం, తన అన్నలు చేసిన దుర్మార్గత తన తండ్రిని ఎంతగానో కృంగదీశాయి. ఆయన చాలా రోజులుగా షెకెములో అస్వస్థునిగా కనిపించాడు. చివరికి నిండు చూలాలైన తన తల్లి రాహేలుతో కూడా ఎక్కువగా మాట్లాడలేదు. ఆ రోజులలో తన తండ్రి పెద్దవాడైనట్లుగా కనిపించాడు.

కాని ఒకరోజు ఉదయాన్నే పరిస్థితి అంతా మారిపో యింది. ఆయనలో గొప్ప మార్పు కనిపించింది. అందరిని ప్రయాణానికి సిద్ధపడమన్నాడు. మరి ఇక్కడ కొనిన స్థలము, కట్టించిన ఇల్లు అవి ఎంత ఖరీదు అయినా వదలి బేతేలు ప్రయాణం కావాలి అన్నాడు. ఆయన ముఖం చూస్తే తన అన్నలకి కూడా ఎదురు చెప్పే ధైర్యము లేకపోయింది. గొప్ప జనసమూహం కదలాలంటే చిన్న విషయం కాదు.

తనకి అప్పుడు పదిహేను సంవత్సరాలు నిండినా తండ్రి దగ్గర తన ఒక్కడికే చనువు. తనని ప్రక్కన కూర్చోబెట్టు కొని తండ్రి చాలా మాట్లాడాడు. పద్దనరాములో ఉన్నప్పుడు సర్వశక్తి గల దేవుడు తనని బేతేలు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. పద్దన రాములో బయలుదేరేటప్పుడు ఆయనకి వేరే ఉద్దేశాలు ఏవి లేవు. తనని విడువక ఎడబాయక ఉండి తనకు కలిగిన సమస్త ఉపద్రవములలో అమితంగా ప్రేమించిన దేవుని మాటకు లోబడి బయలుదేరాడు.

ఆయన పద్దనరాము నుండి బయలుదేరేటప్పుడు, చాలా అనుమానాలు! తన స్వంత అన్నని గురించిన భయం ఉండేది. కాని దేవుడు చెప్పిన మాట ఆయనతో సూటిగా మాటలాడినది. పద్దనరాములో తన తాత లాబాను, తన మామలు తన తండ్రిని ఎక్కువగా కష్టపెట్టారు. చివరి దినములలో మానసికంగా

బాధించారు. అక్కడ ఒకరాత్రి స్వప్నంలో దేవుని దూత 'యాకోబు!' అని పిలిచింది. 'చిత్తము ప్రభువా!' అని అన్నాడు. అప్పుడు ఆయన 'నీ కన్నులెత్తి చూడుము. గొఱ్ఱెపిల్లను దాటుచున్న పొట్టేళ్ళన్ని, చారలైనను, పొడలైనను గలవి. ఏలయనగా లాబాను నీకు చేయుచున్నది యావత్తును చూచితిని. నీవెక్కడ స్థలము మీద నూనె పోసితివో, ఎక్కడ మ్రొక్కుబడి చేసితివో, ఆ బేతేలు దేవుడను నేను. ఇప్పుడు నీవు లేచి ఈ దేశములో నుండి బయలుదేరి నీవు పుట్టిన దేశమునకు వెళ్ళమని' చెప్పెను.

తన తండ్రికి ఎదురైనవి రెండు కష్టములు. ఒకటి లాబాను వలన, రెండు తన అన్న వలన. ఈ రెండింటి నుండి దేవుడు తప్పించటమే కాక తనను క్రొత్తరకంగా ఆశీర్వదించి తన పేరు కూడా 'ఇశ్రాయేలు' అని మారిస్తే – షెకెములో ఉన్న పచ్చదనము, పశువుల మేత, మంచి వాతావరణము చూచి దేవుని మాట మరచినందువలన ఇన్ని కష్టాలు వచ్చాయి. అయినా తనను ఇన్నిసార్లు కాపాడిన దేవుని యొద్దకు వెళ్ళటానికి, ధైర్యము చాలక ముఖం చెల్లక ఉంది. అప్పుడు ఆ ప్రేమ కలిగిన దేవుడే తనను మరలా – నీవు లేచి బేతేలునకు వెళ్ళి అక్కడ నివసించి నీ సహోదరుడైన ఏశావు ఎదుట నుండి పారిపోయినప్పుడు నీకు కనబడిన దేవునికి అన్నమాట మరి ధైర్యము ఇచ్చిందట. అప్పుడు ఒక సహోదరుని వలననే భయం ఉంది. కాని ఇప్పుడు ఇక జనాంగమునకు మొత్తానికి తన కుమారులు చేసిన వధ, దోపిడి వలన ఈ దేశనివాసులైన కనానీయులకు, పెరిజ్జీయు లకు తన కుటుంబం వారు అసహ్యులైనారు.

వారు తన మీద పడి గుంపుగా వచ్చి చంపెదరు. నేను, నా ఇంటివారును నాశనమవుతామని భయపడ్డాడు. తన యొద్దకు వచ్చిన దేవుని వాక్యము ముందు తన హృదయానికి బలమిచ్చి తన ఇంటివారినందరిని బాగుగా ఏలుటుకు ధైర్యమిచ్చింది. అందువల్ల తండ్రి తన ఇంటి వారినందరిని శుద్ధిచేసి, వారి వస్త్రములు మార్చి, వారి వద్దనున్న అన్య దేవతలన్నిటిని, చెవులకున్న పోగులను అక్కడే ఉన్న ఒక మస్తకి వృక్షము క్రింద పాతిపెట్టించాడు. ఆ బేతేలుకు ఇప్పుడు తను సమీపిస్తున్నాడు. తన తండ్రికి పరలోకపు గవిని అయిన ఆ బేతేలు, తన తండ్రికి ఆశ్రయ పట్టణమైన ఆ బేతేలునకు ఇప్పుడు తను ఒంటరిగా సమీపిస్తున్నాడు. అక్కడ తన తాత తండ్రి అబ్రాహాము కూడా ఒక బలిపీఠము కట్టారట. అబ్బో! అది చాలా సంవత్సరాల క్రితం మాట.

ఇప్పటికి రెండు వందల సంవత్సరాల క్రితం మాట. దాదాపు నూట తొంభై సంవత్సరాల క్రితం మొదట్లో తన తాత తండ్రి – అబ్రాహాము దేవుడు పిలిస్తే 'ఊరు' అనే మహాపట్టణం నుండి ఇక్కడికి వచ్చి కరువు వచ్చినందు వల్ల ఐగుప్తు వెళ్ళాడు. అయితే అక్కడి రాజుగారితో తన భార్య విషయం అబద్ధమాడి నందువలన ఐగుప్తు నుండి పంపివేశారు. అప్పుడు సిగ్గుతో, బాధతో, మరి విశేషమైన ఆస్తితో, తన సహోదరుని కుమారుడైన లోతుతో, ఐగుప్తు నుండి తిరిగివచ్చి ఈ బేతేలులోనే తన దేవునికి బలిపీఠము కట్టాడు. అక్కడ నుండి లోతుగారు తన భార్యాబిడ్డలతో తన ఆస్తితో సొదొమ పట్టణం వెళ్ళి పూర్తిగా నాశనమైనాడు.

మరి ముఖ్యంగా తన హృదయాన్ని గాయపరచిన స్థలము కూడా ఈ బేతేలే! తన నాయనమ్మకు, తన తండ్రికి కూడా ఆయాగా ఉన్న దెబోరా చివరికి తనని కూడా తల్లిలాగా ప్రాణంగా చూసుకొనిన ప్రేమమూర్తి దెబోరా ముసలితనము వలన చనిపోయింది. అప్పుడు ఇంటిలో గాని, పనివారిలోగాని ఏడ్వనివారు లేరు. తన తల్లి నిండు చూలాలు. దెబోరా అవ్వ హారాను నుండే హెబ్రోను వచ్చి అక్కడ నుండి రిబ్కా అవ్వ చనిపోయిన తర్వాత హారాను చేరి తన తండ్రిని వదలలేక మరలా హెబ్రోను ప్రయాణం సాగిస్తూ చనిపోయింది.

యోసేపు ప్రయాణం చేస్తున్న గాడిద ఐగుప్తు – తన తండ్రి దేవునికి కట్టిన బలిపీఠం, ఆ స్థంభం గుర్తు పెట్టుకొని ఉన్నది కాబోలు! ఖచ్చితంగా అక్కడికే వచ్చి ఆగింది. అప్పుడప్పుడనిపిస్తుంది తను ఒక్కడే కాదు, ఈ ప్రయాణంలో వెనుకటి సంగతులు ఆలోచిస్తూ ఐగుప్తు కూడా ప్రయాణం సాగిస్తున్నదని. ఐగుప్తే కాదు అతని స్నేహితుడు కూడా ఆలోచిస్తుండవచ్చు. ఇంతవరకు తను ఒక్కడే అనుకున్నాడు. ఇక్కడ మూడు మెదడులు పని చేస్తున్నాయి.

అంతేకాదు తన తండ్రి మొదట పద్దనరాము పారిపోతు న్నప్పుడు తను 'ఒక్కడే' అనుకున్నాడు. కాని రాత్రి దర్శనం

అయిన తరువాత కాని తెలియలేదు. ఈ సృష్టికర్త కూడా తనతో పాటు వస్తున్నాడని. ఆ రాత్రి తన తండ్రి యాకోబు ఈ చోటి రాళ్ళలో తన యెదుట స్థంభముగా నిలబెట్టిన ఈ రాతిని తన తలగడగా చేసుకొని ఆ రాత్రి నిద్రించినపుడు ఒక కల వచ్చిందట. ఆ కలలో ఒక నిచ్చెన భూమి మీద నిలుపబడి యుండినదట. దాని కొన ఆకాశమునంటి ఉండినదంట. యెహోవా దేవుడు దాని పైన నిలువబడి ఉన్నాడు. ఆయన ముఖం చూడలేకపోయాడు. కాని ఆయన స్వరూపం చూశాడంట. ఆ దేవుడు – 'నేను నీ తండ్రి అయిన అబ్రాహాము దేవుడను, ఇస్సాకు దేవుడైన యెహోవాను, నీవు పండుకొనియున్న ఈ భూమిని నీకును, నీ సంతానము నకును ఇచ్చెదను. నీ సంతానము భూమి మీద లెక్కకు ఇసుక రేణువులవలెనగును. నీవు పడమటి తట్టును, తూర్పు తట్టును, ఉత్తరము తట్టును, దక్షిణము తట్టును వ్యాపించెదవు. భూమి యొక్క వంశములన్నియూ, నీ మూలముగా ఆశీర్వదించ బడును. ఇదిగో నీకు తోడైయుండి నీవు వెళ్ళు ప్రతి స్థలమందు నిన్ను కాపాడుచూ  ఈ దేశమునకు నిన్ను మరలా రప్పించెదను. నేను నీతో చెప్పినది నెరవేర్చువరకు నిన్ను విడువనని' చెప్పాడంట.

తన తండ్రి యాకోబు – తను బయలుదేరేటప్పుడు తనని ఆశీర్వదించి 'సర్వశక్తుడగు దేవుడు నీకు తోడైయుండును గాక!' అని అన్నాడు కదా! కాబట్టి ఇప్పుడు తన తండ్రి ఆశీర్వదించిన ప్రకారం ఆ దేవుని సన్నిధి తనతో వస్తుంది. ఈ ఆలోచన రాగానే యోసేపు తన తండ్రి ప్రతిష్ఠించిన రాతి స్థంభము ప్రక్కనే మోకరించి సర్వశక్తుని జ్ఞాపకం చేసుకున్నాడు. 'బేతేలు – దేవుని మందరము' అని తండ్రి చెప్పాడు. ఇప్పుడు తను దేవుని మందిరములో ఉన్నాడు. ఎంత అదృష్టం! ఇది పరలోకపు గవిని. షెకెము నుండి తన తండ్రి యాకోబుతో కలిసి ఇక్కడకు వచ్చినపుడు తనలో ఆ భావన రాలేదు. దేవుని గురించిన భావన రాలేదు. దేవుని గురించిన భావన గుంపులో రాదు కాబోలు. ఒంటరితనంలోనే దేవుని ప్రత్యక్షత మానవ మనస్సుకు అనుభూతి అవుతుంది. ఔను, తన తండ్రి కూడా దేవునితో పోరాడి గెలిచిన రోజున – ఆయన ఒంటరి వాడే!

జీవితంలో ఇదే ప్రథమం. తను ఒంటరిగా ప్రయాణం సాగిస్తున్నాడు.  జీవితంలో ఇక ఇటువంటి రోజులు, అంటే ఒంటరి రోజులు, ఒంటరి నెలలు, బహుశా సంవత్సరాలు కూడా గడపాలేమో. ఏది ఏమైనా ఈ రోజు మంచిరోజు, దేవుని విషయమైన క్రొత్త ఆలోచన. ఈ ఆలోటన మనిషిలో పుట్టటమే దేవుని ఆశీర్వాదము. హెబ్రోనులో కాని, ఇంకెక్కడైనా కాని, రాని దైవాలోచన – ఈ బేతేలులోనే తనకి ప్రాప్తించినది. బేతేలు తన హృదయానికే దేవుని మందిరం అయింది. ఈ మందిరము తన తండ్రి దేవునికి ప్రతిష్ఠితము. యోసేపు హృదయం తేలికగా ఉంది. ఎక్కడికో ఎగిరిపోతున్నట్లు అనంత ఆకాశంలో దేవుని సన్నిధిలో–ఈ చెట్లకి, ఈ నేలకి, ఈ గాలికి, క్రొత్త రూపం వచ్చినట్లుగా, దేవుని స్తుతించినట్లు, పక్షులు ఆయనను ఆలపిస్తున్నట్లు  అనిపిస్తుంది. ఇది పరలోకపు గవిని. కూర్చున్న తను మోకరించాడు. మోకరించినప్పుడు, తను చిన్నవానిగా కనిపించాడు. **(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Samuel Rajendra



# ఆరోగ్యమే మహాశాపము



ఆరోగ్యమే మహాభాగ్యము కదా మరి శాపము ఎలా అవుతుందనే కదా మీ అనుమానం. ***'దేవుడు నరులను యథార్థవంతులనుగా పుట్టించెను గాని వారు వివిధమైన తంత్రములు కల్పించుకొని యున్నారు' (ప్రసంగి 7:29).*** దేవుడు మనుష్యులను యథార్థంగా పుట్టిస్తే మనుష్యులు ఎలాగైతే తమ సొంత ఆలోచనలతో ఆ యథార్థతను పోగొట్టు కున్నారో, అలాగే, దేవుడు ప్రతి మనిషికి ఆశీర్వాదముగా ఆరోగ్యాన్ని దయచేస్తే, మనుష్యులు దానిని తమకు శాపముగా మార్చుకుంటున్నారు. ఎలాగంటారా? రోగమొచ్చి మంచాన పడ్డోళ్ళు ఏ పని చేయలేరు. కుయ్యో, మొర్రో అంటూ ఎప్పుడెప్పుడు రోగం తగ్గిద్దా అని, అసలు లేని భక్తిని బలవంతంగా బయటకు తీసి, శోకండాలు పెట్టి మరీ దేవున్ని ప్రార్థిస్తుంటారు కదా! మరి ఆరోగ్యంగా ఉన్నోళ్ళు ఏం చేస్తుంటారు? కోట్లు ఎలా కూడబెట్టాలని ఆలోచి స్తుంటారు. ఏదో సాధించేదాకా మన ఆరోగ్యం మనల్ని ఊరుకోనియ్యదు. మన ఆరోగ్యం ఇంకా ఏం చేస్తుందంటే మనల్ని అస్సలు ప్రశాంతంగా కూర్చోనియ్యదు, ఎవరిని గిల్లాలా, ఎవరిని గిచ్చాలా అని ఎవరో ఒకరితో గొడవ పెట్టుకొనే దాకా మనల్ని గిల్లుతానే ఉంటుంది. ఏదైనా గొడవ జరిగితే చాలు మన ఆరోగ్యం ఊరుకుంటదా, 'రేయ్, రండిరా చూసుకుందా, అడ్డంగా నరికేస్తాను' అని రెచ్చి పోయేలా చేస్తుంది. అంతటితో ఊరుకుంటే అది అనారోగ్యం అనుకుంటదేమో, ఆరోగ్యాన్ని నిరూపించుకోడానికి వెళ్ళి నాలుగు తన్ని వస్తే కాని ప్రశాంతంగా ఉండదు మన ఆరోగ్యం. మనతో గొడవ పెట్టుకోడానికి ఎవరూ ముందుకు రాకపోతే ఆరోగ్యానికి బోర్ కొట్టి, లైఫ్ బాగా ఎంజాయ్ చెయ్యాలి అనుకొని, ఖరీదైన బట్టలు వేసుకొని, షాపింగ్ చేసి, ఏదైనా సినిమా చూసి, ఫ్రెండ్స్‌తో షికారు చేసి, ఇంటికొచ్చి టి.వి. చూసి, ఫోన్‌లో ఛాటింగ్ చేసుకొని, అప్పటికీ నిద్రరాకపోతే, భవిష్యత్ గురించి ఆలోచిస్తూ, ఏమైనా కుట్రలు, కుతంత్రాలు ప్లాన్ చేసుకొని ఎప్పటికోగాని నిద్రపోదు మన ఆరోగ్యం. ఇంతకు మించి మన ఆరోగ్యానికి వేరే పనేం ఉండదు. ఆరోగ్యానికి అనారోగ్యం చేస్తే తప్ప దేవుడు గుర్తుకురాడు. ***'నేడు జీవమును మరణమును, ఆశీర్వాదమును శాపమును నేను నీ యెదుటను ఉంచి, భూమ్యాకాశములను మీ మీద సాక్షులుగా పిలుచు చున్నాను... నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లును జీవమును కోరుకొనుడి' (ద్వితీయో. 30:19,20).*** దేవుడు మన ఎదుట ఉంచిన ఆశీర్వాదము, శాపములలో మనము ఏదో ఒకటి కోరుకోవాలి. నాకేమి వద్దుపో అని అనటానికి లేదు. దేవుని మాట విని, ఆయన ఆజ్ఞలకు లోబడి, ఆయనను ప్రేమిస్తే దేవుడు మనకు దయచేసిన ఆరోగ్యము మనకు ఆశీర్వాద ముగా మారుతుంది. లేదంటే ఆ ఆరోగ్యమే మనకు శాపమై లేనిపోని రోగాలు తెచ్చుకొని, మనం కూడబెట్టుకున్న ఆస్తింతా హరించుకుపోతుంది. మనం ఏం కోరుకుంటామో ఏం పాడో అని దేవునికి భయమేసి, ఒక హింట్ కూడా ఇచ్చాడు. ***'నీ దేవుడైన యెహోవాను ప్రేమించి ఆయన వాక్యమును విని ఆయనను హత్తుకొనునట్లును జీవమును కోరుకొనుడి'*** అని. మరి మీరు ఏమి కోరుకుంటారు?

ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు

**9866716506**

సీరియల్

# మిక్కిలి సాత్వికుడు

**- కొడవటికంటి**

(మోషే జీవిత చరిత్ర)

సిప్పోరా తన వద్దనున్న యవ్వన స్త్రీలలో ఒకరిని పిలిచి యెహీయేలును పిలవమన్నది. యెహీయేలుతో ఇప్పుడేమి పని అనుకున్నది అక్సా. యెహీయేలు వచ్చి నమస్కారం చేశాడు. ఈ సారి గుడారాలు తీసి మరొక చోట వేసేటప్పుడు మోషే గారి గుడారమునకు ఒక ప్రక్కన అక్సా గుడారం వేయాలి అన్నది. ఇతరుల గురించి మంచి ఆలోచించడంలో సిప్పోరా అమ్మ ఎంత ప్రేమ గలది అనుకున్నది అక్సా. మోషేగారి గుడారానికి ఏ ప్రక్కన వేయాలి? అడిగాడు యెహీయేలు. అది మోషే గారిని అడగండి అన్నది సిప్పోరా. అయినా ఇప్పుడప్పుడే ప్రయాణం లేదు అనుకుంటున్నాను ఎందుకంటే మిర్యాము అమ్మ ఇంకా రెండు రోజులు పాళెం వెలుపల ఉండవలసి ఉన్నది కదా అన్నది సిప్పోరా.

దేవుడు మోషేకు ఆజ్ఞాపించి ప్రకారము ఇశ్రాయేలీయులు ప్రత్యక్ష గుడారము చుట్టూ తమ తమ గోత్రపు టెక్కెములను పట్టుకొని, తమ తమ ధ్వజముల వద్ద పాళెములుగా గుడారములు వేసుకొని నివసించసాగిరి. దేవుని కోపము రగులుకొనకుండునట్లు లేవియులు ప్రత్యక్షపు గుడారము చుట్టూ దిగి, ప్రత్యక్షపు గుడారమునకు సంబందించిన పనులను చేయవలెను.

వారి తరువాత గుడారమునకు తూర్పు దిక్కున యూదా గోత్రికులు దిగవలెను వారు డెబ్బది నాలుగు వేల ఆరువందల మంది. వారి ప్రక్కన ఇశ్శాఖారు గోత్రికులు దిగవలెను వారు యాబది నాలుగు వేల నాలుగు వందల మంది. వారికి ప్రక్కగా జెబూలూను గోత్రపు వారు దిగవలెను వారు యాబది ఏడు వేల నాలుగు వందల మంది. మొత్తం యూదా పాళెము వారు లక్షా, ఎనభై ఆరువేల మంది.

దక్షిణ దిక్కున రూబేను గోత్రికులు, నలభై ఆరువేల ఐదువందల మంది, వారి ప్రక్కన షిమ్యోను గోత్రికులు యాబది తొమ్మిదివేల మూడు వందల మంది, వారి ప్రక్కన గాదు గోత్రికులు నలభై ఐదు వేల ఆరు వందల యాభై మంది దిగవలెను. మొత్తం రూబేను పాళెము వారు ఒక లక్షా యాభై ఒక్క వేయి నాలుగు వందల యాభై మంది.

పడమటి దిక్కున ఎఫ్రాయిము గోత్రికులు, నలభై వేల ఐదువందల మంది, వారి ప్రక్కన మనష్షే గోత్రికులు ముప్పది రెండు వేల రెండు వందల మంది, వారి ప్రక్కన బెన్యామీను గోత్రికులు ముప్పై ఐదు వేల నాలుగు వందల మంది దిగవలెను. మొత్తం ఎఫ్రాయిము పాళెము వారు ఒకలక్షాఎనిమిదివేల ఒక వంద మంది.

ఉత్తర దిక్కున దాను గోత్రికులు, అరవై రెండు వేల ఏడు వందల మంది, వారి ప్రక్కన ఆషేరు గోత్రికులు నలభై ఒక వేయి ఐదు వందల మంది, వారి ప్రక్కన నఫ్తాలి గోత్రికులు యాభై మూడు వేల నాలుగు వందల మంది దిగవలెను. మొత్తం దాను పాళెము వారు ఒక లక్షా యాభై ఏడు వేల ఆరు వందల మంది.

అక్సా మోషే పాళెము వెలుపల కొంచెం సేపు నిలబడి అంతా పరీక్షించింది. దాదాపు 40 సం॥లుగా మోషే పాళెము వైపు వచ్చినా ఎప్పుడూ పరిశీలనగా గమనించలేదు. ఇప్పుడు ఆ తరుణం వచ్చింది. ఇప్పటి నుండి ఇక్కడే జీవించాలి. మోషే గారి నివాసము చాలా పెద్ద ప్రాంగణము. అందులో రకరకాల నివాస స్థలములు వేరు వేరు ప్రయోజనాల నిమిత్తం ఏర్పరచబడినాయి. మోషే గారికి ఐగుప్తు యొక్క అన్ని విద్యలు, తెలివితేటలు, శాస్త్రము, గణితము, వేదాంతము, పూర్తిగా తెలుసు. ఐగుప్తు విద్యలన్నీ, చివరికి చనిపోయిన వారిని వైద్యులు సిద్ధపరిచే విధానం కూడా తెలుసు. ఈ గొప్ప ప్రాంగణము ఒక చోట నుండి ఇంకొక చోటుకు కదిలేటప్పుడు అనుభవజ్ఞులైన వారు ఒక గంటలోనే సిద్ధపరచగలరు. బయట ఎండ ఉన్నప్పటికి,

గుడారము కట్టబడిన తీరు మూడు వరసలు. అందువలన చల్లగా ఉంటుంది. దానిని కట్టగలిగిన వారే కట్టాలి. అక్కా లోపలికి ప్రవేశిస్తుంటే సిప్పోరా దగ్గరకు వచ్చి ప్రేమతో వీపు మీద చేయి వేసి లోపలికి తీసుకెళ్ళి గుడారములోని పరుపుల మధ్య కూర్చోబెట్టింది.

మోషేగారు న్యాయవిమర్శ కొరకు వెళ్ళారు. మధ్యాహ్నం దాకా అక్కడే ఉంటారు. సిప్పోరా రకరకాల తినుబండారాలు అక్కాకు తెచ్చి ఇచ్చింది. పానీయాలు ఇచ్చింది. అవన్నీ కూడా మోషే గారి కుటుంబపు వారు ఉపయోగించేవి. ఒక రకం పానీయం కొంచెం త్రాగగానే ఎగటుగా అనిపించి అక్కా సిప్పోరా వైపు చూసింది. సిప్పోరా పండ్ల రసం తీసుకో అన్నది. నేను మళ్ళీ వస్తాను అని చెప్పి సిప్పోరా వెళ్ళిపోయింది.

మోషే గారితో వివాహం నిశ్చయం అవ్వడానికి కారణము దేవుని ఆజ్ఞ అని, హూరు గారు చెప్పారు. అప్పటి నుండి ఇప్పటి దాకా అంటే దాదాపు 50 సంవత్సరముల వయస్సు వచ్చే వరకు మోషే గారికి సహాయపడకుండా, ఈ వయసులో తనేమి సహాయపడగలదు? అనుకున్నది. సిప్పోరా అమ్మ మరీ వృద్ధురాలు కాలేదు. అయితే ఇదెలా దేవుని చిత్తమైద్ది? మోషే గారిని అడగాలి కానీ ఇటువంటి ప్రౌఢ సంగతులు ఆయనతో మాట్లాడే ధైర్యం లేదు. అంతలో మోషే గారు గుడారములోకి వస్తున్నట్లుగా అలికిడి అయ్యింది. ఆయనతో వచ్చిన వారు బయటనే ఉన్నారు. మోషే గారు ఒక్కరే లోపలికి వచ్చి, అక్కాకు దగ్గరగా కూర్చొని, నీకు వచ్చే సందేహాలన్నీ అవే తీర్చుకుంటాయి. వాటి విషయమై ఎక్కువగా ఆలోచించవద్దు. మిద్యానీయు రాలిని పెండ్లి చేసుకునే ముందు నేను ఎంతో ఆలోచించాను. కానీ నా ఆలోచనలన్నీ వ్యర్థము. ప్రభువే అన్నింటికి సమాధానం. అయితే కాలం గడిచిపోవాలి అందుకే ఈ ప్రయాసలు అన్నీ. అక్కా ఏదో అడగబోయింది. కానీ మౌనంగా ఉండిపోయింది. ఏంటి? అన్నట్లు చూశాడు మోషే.

సాటియైన సహాయం అంటే ఏంటి? అని అడిగింది అక్కా. మోషే ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి నోరు విప్పి సాటియైన సహాయిని అయిన తరువాతనే సిప్పోరా నాకు పిల్లల్ని కన్నది. కాబట్టి మనకు వచ్చే ప్రతి ప్రశ్నకు జవాబు దేవుడు ఇచ్చేవరకు మనం మౌనంగా వేచి ఉండాలి. దేవుడు మనకు ఎంతవరకు సంతోషం ఇవ్వగలడో దేవుడు అన్ని విషయాల్లో పూర్తిగా ఆ సంతోషాన్ని మనకు ఇస్తాడు అన్నాడు.

మా దేశం నుండి మోషే గారు మా జనాంగం అందరిని ఐగుప్తు తీసుకువచ్చి ఇక్కడే నివసింపచేసినా, ఇక్కడ వారి ప్రేమ వలన మాకు ఐగుప్తు క్రొత్తగా అనిపించలేదు. మోషే గారు మిద్యాను దేశం వెళ్ళిపోయినపుడు 50 సం॥ల మా జీవనంలో ఏవిధమైన మార్పు రాలేదు కానీ దాదాపు 50 సం॥ల తర్వాత మోషే గారు అహరోను గారు ఐగుప్తు వచ్చి ఫరోతో సంబంధం లేనివారి వలె స్వతంత్రులుగా, ఇంకా చెప్పాలంటే పూర్తిగా పరాయి వారివలె, ఫరో స్థాయికి తగిన స్థాయి నిలబెట్టుకొని మాట్లాడుతున్నారు. ఫరో ఈ ప్రపంచం అందరికి పెద్ద అయినా, మోషే గారితో దేవుని ప్రవక్తగా వారికి ఇవ్వవలసిన స్థానం ఇచ్చి మాట్లాడాడు. ఫరో గారి మీదకు మోషేగారు చెప్పినా కొన్ని అద్భుతమైన సూచనలు జరిగి ఐగుప్తీయుల అందరిని భయపెట్టాయి. మోషే గారి స్థాయి గొప్పదైంది. చివరికి ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి వెళ్ళిపోవడానికి మార్గం సుగమమైంది. మా దేశం నుండి వచ్చిన మా జనాంగము అనగా ఇతియోపియ నుండి వచ్చిన వారిని ఇశ్రాయేలు జనాంగము వలె ఐగుప్తు విడిచిపెట్టడానికి మోషే గారు ప్రణాళిక సిద్ధం చేశారు. మాకెంతో సంతోషమైంది. ఫరోకును, ఐగుప్తీయులకు కూడా మేము వెళ్ళిపోవడం సంతోషమైంది. మోషే గారి అన్న అహరోను, అక్క మిర్యాము మోషే గారికి ఇచ్చే స్థానం దేవుని స్థానమే. అప్పుడప్పుడు మోషే గారు వారందరిది క్రింది స్థానం అనేవారు. కానీ ఇప్పుడు ఈ అరణ్యములో ప్రతిరోజు దేవుడు పంపిస్తున్న మన్నా భోజనం, రాత్రి అగ్నిస్థంభం, పగలు మేఘస్థంభం ఇన్ని లక్షల మందికి మొదట్లో అద్భుతము వలె ఆశ్చర్యంగా ఉన్నా తరువాత సర్వసాధరణమై పోయింది.

**(సశేషం)**

# దేవుడు - సిరి

యూదా రాజులలో ఆహాజు యెహోవా దృష్టికి బహు వ్యతిరేకముగా జీవించాడు. అతని తరువాత అతని కుమారుడు హిజ్కియా రాజయ్యాడు. అప్పుడతని వయస్సు పాతిక సంవత్సరాలే. ఆహాజు ఎంతగా దేవుని ఎదుట వ్యతిరేకిగా జీవించాడంటే అహాజు చనిపోయినప్పుడు అతనిని రాజుల సమాధులలో భూస్థాపితం చెయ్యలేదు.

అతని కుమారుడు హిజ్కియాకు తన తండ్రి ప్రవర్తన అంతా తెలుసు. అయినా అతను తన జీవితాన్ని యెహోవా దేవునికి సమర్పించుకున్నాడు. హిజ్కియా రాజైనపుడు దేశము బహుహీనస్థితిలోవున్నది. 2దిన. 28వ అధ్యాయము చదివితే యూదాదేశము ఎటువంటి హీనస్థితిలోనికి దిగజారిపోయిందో తెలుస్తుంది. అటువంటప్పుడు హిజ్కియా దేవుని నమ్ముకొని తన దేశములో సైన్యాన్ని అభివృద్ధిపరచి ప్రజలకు సహాయ పడేవిధంగా వ్యవసాయమును అభివృద్ధి చేయాలి కాని – 29:3లో అతడు రాజ్యమునకు రాగానే మొదటి సం॥ము, మొదటి నెలలోనే అంటే రాజైన వెంటనే యెహోవా మందిరపు తలుపులను తెరచి వాటిని బాగుచేసి, యాజకులను సమకూర్చాడు. తన దగ్గర ఉన్న వనరులన్ని దేవుని మందిరముకు, ఆరాధన కార్యక్రమాలకు ఖర్చు పెట్టాడు. జనం అతనిని ఎన్నిరకాలుగా అనుకొన్నారో మనకు తెలియదు. తెలివి తక్కువవాడు, పిచ్చివాడు, చిన్న పిల్లాడు. ఇతనికేమి తెలుసు? అనుకొని ఉండవచ్చు. ముందు ఇల్లు (రాజ్యము) సరిచేసుకోవాలి కదా అనుకొని ఉండవచ్చు. హిజ్కియా యొక్క గురి యెహోవా – "రాజు ఇట్టి నమ్మకమైన చర్య చూపిన తర్వాత అష్షూరు రాజైన సన్హెరీబు యూదాదేశములో చొరబడ్డాడు. తన సేవకులను పంపి యూదా ప్రజలు వినేటట్లుగా బహు పరుషపదాలు పలికాడు. సన్హెరీబు చాలా బలవంతుడైన రాజు..

అయినా రాజైన హిజ్కియాయు యెషయా ప్రవక్త ఎదుటకు తన దూతలను పంపి – నిలచిన శేషము కొరకు నీవు హెచ్చుగా ప్రార్థన చేయుము అని అడిగాడు.

రాజైన హిజ్కియా ఆమోజు కుమారుడైన యెషయా అను ప్రవక్తయు ఇందును గూర్చి ప్రార్థించి ఆకాశము తట్టు చూచి మొరపెట్టగా, యెహోవా ఒక దూతను పంపెను. అతడు అష్షూరు రాజు దండులోని పరాక్రమశాలులందరిని సేనా నాయకులను అధికారులను నాశనముచేయగా అష్షూరు రాజు సిగ్గునొందినవాడై తన దేశమునకు తిరిగి వెళ్ళి పోయెను. ఇప్పుడు హిజ్కియా రాజ్యాధినేతగా కాక – మనలాంటి ఒక వ్యక్తిగా ఇరవై అయిదు సంవత్సరాలలో ఒక కుటుంబమును ప్రారంభిస్తే ఏమిచేసేవాడు? మొదట తను ప్రతి ఆదివారం హాజరయ్యే ఆలయము విషయం ఆలోచించేవాడు. తరువాత వచ్చే కుటుంబ కష్టాలు సంఘకాపరితో కలసి దేవుని ప్రార్థించేవాడు. దేవుడు అతనిని అన్ని కష్టాలలో నుండి విడిపించేవాడు.

మనం దశమభాగమును కృతజ్ఞతార్పణలను మందిరములోనికి తీసుకొని రావాలంటే ఈ కష్టాలలోనా అనుకుంటాము. ఏమి తిందుమో, ఏమి త్రాగుదుమో అని విచారింపకుడి, అనుమానము కలిగి యుండకుడి అన్నాడు యేసు ప్రభువు. నీవు యేసునియందు విశ్వాసముంచి ఆయన ఆజ్ఞల ప్రకారం నడుచు కొంటే ఈలోకపు జనులలో నుండు ప్రత్యేకించబడతావు. అందుకే ప్రభువు – ఈలోకపు జనులు వీటన్నిటిని వెదుకుదురు. ఇవి మీకు కావలసియున్న వని మీ తండ్రికి తెలియును. మీరైతే ఆయన రాజ్యమును వెదకుడి. దేవుని రాజ్యముతో కూడా ఇవి మీ కనుగ్రహింప బడును. చిన్నమందా! భయపడకుడి అన్నాడు. సృష్టికర్తయైన దేవుడు మనకిచ్చిన హామీ ఇది.

హగ్గయి ఇలా అన్నాడు – ఈ మందిరము పాడై యుండగా మీరు సరంబీ వేసిన ఇండ్లలో నివశించుటకు ఇది సమయమా? కాబట్టి సైన్యముల కధిపతియగు

**(మిగిలాది 16వ పేజీలో)**

స్త్రీల విభాగము

# ఘనురాలు

షూనేము అనే ఒక పట్టణంలో ఒక స్త్రీ ఉంది. ఆమె బాగా ధనవంతురాలు. వారికి బాగా ఇళ్ళు, పొలాలు ఉన్నాయి. భర్త ముసలివాడు. పిల్లలు లేరు. బైబిల్లో ఆమె పేరు లేదు గాని అందరు ఆమెను ఘనురాలు అంటారు. బహుశ ధనవంతురాలనేమో!

ఆమె ధనంలో మాత్రమే ఘనురాలు కాక దైవభక్తి లోను ఘనురాలే. ఆతిథ్యం చేయడంలోనూ ఘనురాలే.

ప్రవక్తయైన ఎలీషా షూనేము పట్టణానికి తరచుగా వచ్చినపుడు ఆమె తన ఇంటిలోనే అతనికి భోజనం సిద్ధం చేస్తూండేది. అలా చాలాసార్లు ఆమె ఇంటిలో భోజనం చేస్తుండేటప్పుడు ఆమెకు ఒక తలంపు కలిగింది. వెంటనే తన భర్తతో విషయం చెప్పింది.

"మన ఇంటికి వచ్చుచు పోవుచున్నవాడు భక్తిగల దైవజనుడని నేనెరుగుదును. కావున మనము అతనికి గోడమీద ఒక చిన్న గది కట్టించి అతని కొరకు మంచము, బల్ల, పీట, దీపస్తంభము నుంచుదము. అతడు మన యొద్దకు వచ్చునపుడెల్ల అందులో బసచేయవచ్చును" అని చెప్పెను. (2రాజులు 4:10).

తన భర్త ఆజ్ఞ తీసుకోవడంలో ఆమె తన భర్తకు లోబడిన విధానం తెలుస్తుంది. ఆయన సహకారంతోనే ఎలీషా కొరకు ఒక గది కట్టించి, అందులో సమస్త సౌకర్యాలు సిద్ధం చేసింది. ఎలీషా ఆ పట్టణంలోకి వచ్చినపుడెల్లా మంచి భోజనంతో పాటు సమస్త సౌకర్యాలతో కూడిన గదిలో చక్కగ విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాడు. అందుకే ఆమెకేదైనా ఉపకారం చేయాలని ఎలీషా తలంచి తన సేవకుడైన గేహజీ ద్వారా ఆమెను పిలువనంపించాడు. ఆమె వచ్చి అతని ముందు నిలువబడింది.

"నీవు ఇంత శ్రద్ధాశక్తులు చూపిస్తున్నావు నీకు నేనేం చేయాలి? రాజుతోనైనా సైన్యాధిపతితో నైనా నిన్ను గూర్చి నేను మాటలాడాలని కోరుతున్నావా?" (2రాజులు 4:13) అని ఆమెను అడిగాడు. ఇదే అవకాశంగా ఆమె ఏదైనా కోరుకోవచ్చును గాని ఆమె ప్రతిఫలాన్నాశించి అతనికి సేవలందించడం లేదు. కాని దేవుని యందు భయభక్తులు గలదై దైవజనుని ఆదరించి ఆతిథ్యమిచ్చింది. అందుకే ఆమె వెంటనే ....

"నేను నా స్వజనులలో కాపురమున్నాను" అని (13) జవాబిచ్చింది.

నిస్వార్ధముతో ఆమె చేస్తున్న సేవ త్యాగపూరిత మైనది. ఏ మాత్రము ప్రతిఫలం ఆశించలేదు. ఒకవేళ ఆ ఉద్దేశ్యంతో ఆమె చేయకపోయినా ఇప్పుడు వచ్చిన అవకాశం కూడా ఉపయోగించుకోలేదు. అవకాశం కోసమే దగ్గరకు చేరేవారు చాలామంది ఉంటారు. అవకాశాలు బాగా ఉపయోగించుకొని అవసరాలు తీరాక వారి ముఖం కూడా చూడని వారు ఎంతమందో! అందుకే ఈమె నిస్వార్ధంలో కూడా ఘనురాలుగ ఎంచబడింది. అయితే గేహజీ ఈ అవకాశం ఆమె పోగొట్టుకోవడం ఇష్టంలేక తానే "ఆమెకు కుమారుడులేడు, ఆమె భర్త ముసలివాడు" (14వ) అని చెప్పాడు. వెంటనే ఎలీషా ఆమెను పిలిచి

''మరునటి యేట ఈ రుతువున నీ కౌగిట కుమారుడుండును" అని (16వ) ఆమెతో చెప్పాడు.

తర్వాత ఆమె గర్భవతియై కుమారునికి జన్మ నిచ్చింది. దేవునియందలి ఆమెకున్న భయభక్తులు, భర్తకు లోబడే వినయవిధేయతలు, నిస్వార్ధ గుణమూ ఆమె గొడ్రాలి తనాన్ని పోగొట్టి ఒక కుమారునికి తల్లిగా చేశాయి.

కొన్నాళ్ళ తర్వాత ఆ కుమారుడు తండ్రితో కూడా పొలం వెళ్ళాడు. పనివారు పనిచేస్తుంటే చూస్తూవున్నాడు. కాని అంతలోనే ఎండదెబ్బ తగలడం వల్లనేమో తలనొప్పి ప్రారంభమై మరి ఎక్కువైంది. పిల్లవాడి బాధ ఎక్కువ కావడం

చూచి పనివారితో తల్లి దగ్గరకు పంపించాడు తండ్రి. కాని ఆ కుమారుని బాధ మరింత ఎక్కువై మధ్యాహ్నం అయ్యేసరికి తల్లి ఒడిలోనే ప్రాణం విడిచాడు. తల్లి బాధ ఓర్వలేనిది కదా! అందులో లేక లేక పుట్టిన కొడుకు. అయినా ఆమె గుండె నిబ్బరం చేసుకుంది. గగ్గోలు పెట్టి ఏడ్చి గందరగోళం చేయకుండా దుఃఖమంతా గుండెల్లోనే దాచుకొని కొడుకును ఎత్తుకొని దైవజనుని కొరకు కట్టిన గదిలో, అతని కొరకు అక్కడ ఉంచిన మంచం మీద వానిని పండుకోబెట్టి తలుపు వేసి బయటకు వచ్చింది. దైవజనుని దగ్గరకు వెళ్ళడానికి భర్త ఆజ్ఞ తీసుకుంది. అప్పుడు భర్తకు కూడా విషయం చెప్పలేదు. భర్త – విశేషము ఏమీ లేదే ఎందుకు దైవజనుని వద్దకు వెళ్ళడం అని అడిగినపుడు "నేను పోవుట మంచిది" (24వ) అని చెప్పిందేగాని విషయం చెప్పలేదు. అది దైవసన్నిధిలోనే మొదటిగా చెప్పుకోవాలని ఆమె కోరిక. అందుకే గాడిద ఎక్కి త్వరత్వరగా దైవజనుడైన ఎలీషా దగ్గరకు వెళ్ళింది. దైవజనుడు కర్మెలు పర్వతం మీద ఉన్నాడు. దూరము నుండి ఆమెను చూచి త్వరగా పనివాని ఆమెకు ఎదురుపంపి "నీవును, నీ పెనిమిటియు, నీ బిడ్డయు సుఖముగా ఉన్నారా?" అని అడుగమన్నాడు.

పనివాడు ఆమాట అడిగిన వెంటనే ఎంతో నిబ్బరముగా "సుఖముగా ఉన్నాము" (26వ) అని చెప్పింది. ఎందుకంటే ముందుగా దైవజనుని దగ్గర మాత్రమే చెప్పాలని ఆమె విశ్వాసంతో కనిపెట్టింది. ఆ విశ్వాసంతోనే నిబ్బరంతో సుఖముగా ఉన్నామని చెప్పగలిగింది. ఆ తరువాత కర్మెలు కొండమీద ఉన్న దైవజనుని దగ్గరకు వెళ్ళి అతని కాళ్ళు పట్టుకుంది. గేహజీ ఆమెను దైవజనుని యొద్దకు రాకుండా ఆటంకపరచాలని చూచాడు. ఎలీషా అతనిని వారించాడు. ఆమె తన బాధ దైవజనునికి తెలిపింది. అంత వరకు తన హృదయక్షోభ తన గుండెలోనే దాచుకొని వేరెవ్వరికి చెప్పలేదు. వెంటనే ఎలీషా లేచి ఆమెతో కూడా ఆమె ఇంటికి వెళ్ళాడు. తన కొరకు ప్రత్యేకింపబడిన ఆ గదిలో తన మంచం మీద మరణమైన ఆమె కుమారుడు ఉండడం చూచి ఆ గది తలుపుమూసి దేవునికి ప్రార్ధన చేశాడు.

తరువాత బిడ్డమీద తన్నుతాను దాచుకొని పొడుగుగా పండుకొనగా బిడ్డకు వెట్టపుట్టి ఏడు మారులు తుమ్మి కళ్ళు తెరిచాడు. దైవజనుడు విశ్వాసముతో కూడా ఘనురాలైన ఆమెను పిలిచి బిడ్డను ఆమెకు అప్పగించాడు. ఆమె అతనికి సాష్టాంగ నమస్కారం చేసి బిడ్డను ఎత్తుకొని వెళ్ళింది.

ఏదైనా కష్టం వచ్చినపుడు అది ఎంత పెద్ద కష్టమో, దాని వలన కాదు ఎంత బాధపడిపోతున్నారో ఇరుగుపొరుగు వారికి, ఇతరులకు, వివరించి, వివరించి చెప్పి పెద్దగోల చేసుకోవడం చాలామందికి అలవాటే. అంతా దేవునికి అప్పగించి దేవుని దగ్గరే మన హృదయాన్ని కుమ్మరించుకోవడం ఎంతో అవసరం కదా!

**మనుష్యులను నమ్ముకొనుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలు** (కీర్తన 118:8,9) అను వాక్యం ఎంత సత్యమైనది!

అందుకే ఈ షునేమీయురాలు ధనములో మాత్రమే ఘనురాలు కాక దేవునియందు భయభక్తులలో ఘనురాలు. దైవజనులను గౌరవించడంలో ఘనురాలు. భర్తకు లోబడిన వినయ విధేయతలలో ఘనురాలు. నిస్వార్ధ పరిచర్యలో ఘనురాలు. విశ్వాసములో ఘనురాలు. దైవసన్నిధికి ప్రాముఖ్యత నివ్వడంలో ఘనురాలు. అందుకే ఆమె ఘనురాలుగా ఎంచబడి గొప్ప ఆశీర్వాదాలు పొందింది.గొడ్రాలుగ ఉన్న ఆమె సంతుగల తల్లిగా ఆశీర్వదింపబడింది. చనిపోయిన కుమారుని ప్రాణంతో తిరిగి పొందింది.

ఏడు సంవత్సరములు ఫిలిష్తీయ దేశంలో గడిపి కరువు కాలము ముగిసిన తరువాత తిరిగి వచ్చినపుడు రాజు ఆమె పక్షముగా ఒక అధిపతిని నియమించి ఆమె సొత్తు యావత్తు ఆమెకు ఇప్పించాడు.

వాక్యంలోని ఈ వనిత ఏ గుణగణాలతో ఘనురాలి గా ఎంచబడిందో తెలుసుకొని – ఆమెను అనుస రించడం ప్రతి వనితకూ అవసరం. ఆలాగు చేయుటకు ప్రయత్నించుదము గాక!

# దేవుడు నిన్ను నడిపిస్తాడు

'నడిపించు నా నావ నడిసంద్రమున దేవా' అన్న పాట తెలియని వారుండరు కదా. అయితే నిజజీవితంలో దేవుని నడిపింపును కోరుకునే వారు చాలా తక్కువ మంది. ఏదో అవసరమైనప్పుడు తప్ప, అనగా కష్టమొచ్చినప్పుడో, ఇరుకు ఇబ్బందులలో ఉన్నప్పుడో తప్ప దేవుని నడిపింపును ఎవరూ కోరుకోరు. ఏ ఇబ్బంది లేకపోతే దేవున్ని అనుదినము గుర్తు తెచ్చుకొనే వారు చాలా తక్కువమంది ఉంటారు. చాలామంది దేవునితో సంబంధంలేకుండా వారికున్న జ్ఞానాన్నిబట్టి, తెలివితేటలనుబట్టి వారి జీవితాన్ని నడిపించుకుంటుంటారు. అయినప్పటికీ వారి జ్ఞానము, తెలివితేటలు వారిని కాపాడ లేవు. మహాజ్ఞానియైన సొలొమోను సైతం, రాజ్యమును ఏలడానికి దేవుని నడిపింపును కాక, జ్ఞానమును కోరు కున్నాడు. అందుకే అతని జ్ఞానము అతన్ని కాపాడలేక పోయింది. అదే అతను జ్ఞానమును కాక, దేవుని నడిపిం పును కోరుకొని ఉన్నట్లయితే అతను పాపములో పడివుండే వాడు కాదు.

ఇశ్రాయేలీయులను దేవుడు ఐగుప్తు దేశాన్నుండి కనాను దేశమునకు నడిపించి, వారికి రాజుగా, సమూయేలు ప్రవక్త న్యాయాధిపతిగా ఉన్నప్పుడు ఇశ్రాయేలీయులు దేవున్ని కాకుండా, సకల జనుల మర్యాద చొప్పున వారికి రాజును నియమింపుమని సమూయేలును అడిగారు. అంటే వారికి ముందు ఉండి నడిపించటానికి వేరొక రాజుని కోరుకున్నారు. అందుకే వారు దారి తప్పారు. నేను మిమ్మల్ని నడిపిస్తాను నా దగ్గరకు రండి, అప్పుడు మీకు ప్రయోజనం కలుగుతుం దని చెప్పినా దేవుని మాట వినే స్థితిలో మనుష్యులు లేరు. ఇశ్రాయేలీయులను అరణ్యమార్గంలో నలభై సంవత్సరాలు దేవుడు వారిని నడిపించాడు. వారు ఏది కోరుకుంటే అది వారికి ఇచ్చాడు. ***'నేను మీ దేవుడనైన యెహోవానని మీరు తెలిసికొనునట్లు నలువది సంవత్సర ములు నేను మిమ్మును అరణ్యములో నడిపించితిని. మీ బట్టలు ఒంటి మీద పాతగిలి పోలేదు. మీ చెప్పులు మీ కాళ్ళను పాతగిలి పోలేదు' (ద్వితీయో. 29:5).*** కాబట్టి నీవు ఎలా నడుస్తున్నావు, నిన్ను ఎవరు నడిపిస్తున్నారు అనేదాన్నిబట్టి నీ జీవితం ఆధారపడి ఉంటుంది. ఈ భూమ్మీద ఉన్నంత కాలం దేవుని యొక్క కాపుదల, భద్రత కావాలంటే దేవుని సన్నిధిలో ఉండి ఆయన నడిపింపు కోరుకుంటే ఆయన నిన్ను నడిపిస్తాడు. నీకు ప్రయోజనం కలుగునట్లు దేవుడు నిన్ను నడిపించాలని కోరుకుందాము.

**<u>చందాదారుల వివరములు</u>**

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపో. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు

**K. Samuel Rajendra, SBI Collector Office Branch, Ongole**

**A/c No. 10957294362**

సాక్ష్యము

# వెదకని నాకు దొరికిన ప్రభువు

**నా పేరు చంద్రకుమారి.** మాది నెల్లూరు జిల్లా కావలి మేము కమ్మకులస్థులు. మేము వెంకటేశ్వరుడిని, రాముడిని ఎక్కువగా పూజించేవారము. మా నాన్నగారి పేరు చెన్నకేశవ రావు. చిన్నతనం నుండి ఎంతో భక్తిశ్రద్ధలతో పూజలు చేసేవారు. మా తల్లిగారి పేరు జయప్రద.

మా నాన్నగారికి మేము ముగ్గురు పిల్లలము. మేము పుట్టిన తర్వాత నాన్నకు డబుల్ టైఫాయిడ్ జ్వరం వచ్చింది. వ్యాధి బాధతో తాన దేవుళ్ళను ఎంతగా మొక్కిపెట్టుకున్నా సహాయం దొరక లేదని పూజలు తాత్కాలికంగా మానివే శాడు. అదే సమయంలో పట్టణంలో కమ్యూనిస్టుల ప్రభావం ఎక్కువగా ఉండేది. కొందరు ఆ పార్టీ సిద్ధాంతాలు చెప్పటం వలన నాన్న వారి సభలకు వెళుతూ, దేవుడేలేడనే హేతువాది గా మారిపోయాడు. ఇంట్లో ఉన్న విగ్రహాలను పారవేశాడు. 'మనకు కనిపించని దేవుడికి ప్రసాదాలు, పూజలు, పుర స్కారాలా?' అంటూ – ధనం వృధా చేయటం కన్నా, మనకు కనిపించే పేదవారికి సహాయం చేయమని, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టమని మాకు చెప్పేవాడు. మమ్ముల ను లెనిన్, స్టాలిన్ కమ్యూనిస్టు పుస్తకాలను చదవమనేవాడు. అయితే నాకు మాత్రం నిష్టగా పూజలు చేయడం ఇష్టంగా ఉండేది. మేము పూజలు చేస్తున్నప్పుడు నాన్న మా వెనుకనే కూర్చుని విగ్రహాల్ని ఎగతాళి చేసేవారు.

నా హైస్కూలు చదువు క్రైస్తవ స్కూల్లో కొనసాగింది. నేను పదవ తరగతిలో ఉండగా వినాయకచవితికి ఎంతో ఉత్సాహంగా పుస్తకాలకు పూజలు చేసుకొని వాటి గురించి మాట్లాడుకుంటుండగా అక్కడ ఉన్న క్రైస్తవ విద్యార్థులు 'మట్టితో చేస్తారు, పూజలు చేస్తారు, నీళ్ళలో వేస్తారు ఇంకెక్కడి మీ దేవుడు? మీ దేవుళ్ళు వట్టి రాళ్ళు రప్పలే! ఉలకవు పలకవు అని ఎగతాళిగా మాట్లాడారు. నేను సహించలేకపోయాను. వీళ్ళ స్కూల్లో చదవబట్టే కదా మనలను అవమానించారు. కనుక ఇక నుండి ఈ స్కూల్లో జరిగే ప్రార్థనలు మనం చేయకూడదని నిశ్చయించుకు న్నాను. నాకు స్కూల్లో ఎప్పుడూ మంచి మార్కులు వచ్చేవి. ప్రీ–పబ్లిక్‌లో కూడ స్కూల్లో మంచి ర్యాంక్ వచ్చింది. పబ్లిక్ పరీక్ష వ్రాయటకు వెళ్ళిన క్రైస్తవ పాఠశాలలోని నన్స్ ఎంతో ప్రేమతో 'మీరు కష్టపడి చదివిన దానికి ఫలితం పొందుటకు యేసును ప్రార్థించండి. యేసు మంచిదేవుడు, మీకు తప్పక సహాయం చేస్తాడు' అని చెప్పేవారు. వారి మాటలను విని ప్రతి పరీక్షకు వారు చెప్పిన విధంగా ప్రార్థన చేసేదానిని. ఫలితాలు వచ్చాయి. మంచి మార్కులతో పాస్ అవుతానని ఆశించిన నేను ఫెయిల్ అయినందుకు ఎంతో వేదనకు గురయ్యాను. నాకు ఎంతో అవమానంగా ఉంది. మార్కులు వచ్చాయి. అన్ని సబ్జెక్టులలో మంచి మార్కులొచ్చాయి. ఒక్క సబ్జెక్టులో మాత్రం ఫెయిలయ్యాను. అదీ 'ఒకే ఒక్క మార్కు' తక్కువతో. ఎందుకిలా జరిగింది? నా దేవుళ్ళకు కాక వేరే దేవునికి ప్రార్థనచేయటం వల్లా? అయినా యేసు మంచి దేవుడైతే ఒక్క మార్కు కూడ సహాయం చేయలేకపోయాడా? అని బాధపడుతూ నా పొరపాటుకు పరిహారంగా రామకోటి రాయటం ప్రారంభించాను. కొందరు 'ఓం నమఃశివాయ అని వ్రాయి మంచిది' అని చెప్పగా రెండూ వ్రాయటం మొదలుపెట్టాను. నా తల్లిదండ్రులు రీ – వాల్యుయేషన్‌కు అప్లయ్ చేశారు. ఆ సంవత్సరం క్రొత్తగా కంప్యూటర్ పద్ధతి అమల్లోకి రావటం వల్ల కొందరి అడిషనల్ పేపర్లు తారు మారు అవటం వల్ల, కొన్ని పొరపాట్లు జరిగాయి. కాబట్టి ఐదు గ్రేస్ మార్కులు ఇస్తున్నాం. వెంటనే మీరు కాలేజీలో అన్ని గ్రూపులకు అర్హులని సమాధానం పంపారు. మా దేవుళ్ళు నన్ను క్షమించారు అని నమ్మి, ఇంకెన్నడూ ఆ యేసుకు ప్రార్థన చేయకూడదు, క్రైస్తవుల మాటలు విన కూడదు, వారి మాటలు వింటే మేలుకన్నా కీడే జరుగు తుందని అనుకున్నాను.

కాలేజీలో చేరాను. కాలేజి గేటు ప్రక్కనే ఆంజనేయస్వామి

గుడి ఉంది. ప్రతిరోజు స్నేహితులను తీసుకొని గుడిలో ప్రదక్షిణలు చేసి వచ్చేదాన్ని. ఇంటర్, డిగ్రీ ఫస్ట్‌క్లాసులో పాసయ్యాను. తరువాత షార్ట్‌హ్యాండ్ కూడా నేర్చుకున్నా. డిగ్రీ రిజల్ట్స్ వచ్చిన వెంటనే నాకు లేడీస్ పాలిటెక్నిక్ కాలేజిలో డిమానిస్ట్రేటర్‌గా ఉద్యోగం వచ్చింది. నా సహ ఉద్యోగి బంధువుల నుండి మ్యారేజి ప్రపోజల్ వచ్చింది. నెలలోపే వివాహం నిశ్చయించారు. పెండ్లి కుమారుని తరపువారు క్రైస్తవ్యం తీసుకొని వున్నారని తెలిసి వారిని విచారించగా 'మీకా భయం అక్కర్లేదు. మా అబ్బాయి చర్చికి వెళ్ళేదిలేదు, మారేది లేదు' అని హామీ ఇచ్చినను ఆనాడు పరీక్షలలో ప్రార్థిస్తే బాధ, అవమానం పొందాను. వీళ్ళు ఆ యేసును అనుసరించే వారైతే నాకెన్ని బాధలుంటాయో అనే దిగులుతో ఆహారం సహించేదికాదు. పెండ్లి రోజు ఉదయానికి హై టెంపరేచర్ రాగా ఆసుపత్రికి తీసుకెళ్ళి ఇంజెక్షన్ ఇచ్చి సాయంత్రానికి నన్ను పెండ్లికి సిద్ధపరచారు.

మా వారికి పది సం॥ల వయస్సులోనే మా మామగారు చనిపోయారట. భర్త చనిపోయన తర్వాత మా అత్తగారు తన కుమారుని అతి గారాబంగా పెంచారు. ఆమె తన కుమారుడు ఏ విధంగాను కష్టపడకూడదని ఏ పని చేయ నిచ్చే వారు కాదు. కాలక్షేపానికి సాయంత్రం పూట ఆఫీసర్స్ క్లబ్‌లో మెంబర్‌షిప్ తీసుకుని క్లబ్‌లో కార్డ్స్ ఆడుతుండే వాడు. నేను మా అత్తగారింటికి వచ్చిన మొదటిరోజే ఆయన క్లబ్‌కి వెళ్ళారు. నాకు బాబు, పాప పుట్టారు. అయినా మా వారు ఏమీ పట్టించుకొనేవారు కాదు. మా ఇంటి ప్రక్కనున్న వారిలో కొందరు 'నీవు క్రీస్తుననమ్ముకో' అనేవారు. ఎందుకు ఈ క్రైస్తవులు 'యేసును నమ్ముకో' అంటుంటారు. ఇతరులకు మంచి జరిగితే చెప్పవచ్చు. కాని ఇతరులు బాధపడేదానికా యేసును నమ్ముకోవాలా? అనుకొనేదానిని.

నా భర్త క్లబ్ మానేయాలని అందరి దేవుళ్ళకు మ్రొక్కే దానిని. ఒకరోజు అర్ధరాత్రి కలలో కటిక చీకటిగా ఉన్న ఆకాశం నుండి సిలువ ఆకారంలో వెలుగు కనబడి అందులో నుండి రెండే మాటలు వినబడ్డాయి."నీవు నా దగ్గరకు రా, నేను నిన్ను రక్షిస్తాను". ఆ మాటలు వినబడగానే నేను నా చేయిపైకి ఎత్తాను. అప్పుడు ఆ వెలుగు నా వ్రేళ్ళను తాకింది. 'దేవుడు నన్ను పట్టుకొన్నాడు, దేవుడు నన్ను పట్టుకొన్నాడు' అని గుండెలపై కొట్టుకొంటుండగా మెలకువ వచ్చింది. నా శరీరం గడగడ వణకుతూనే ఉంది. రాత్రి 12 గంటలైంది. 'అదేంటి నాకు కనబడింది సిలువ గుర్తు–అంటే యేసు. అందులో మాటలు వినబడ్డాయి. అదీగాక నేనే స్వయంగా దేవుడ్ని పట్టుకున్నాను' ఆయన దేవుడైతే ఆ రోజు ఒక్కమార్కు కూడా సహాయం చేయలేక పోయాడు. ఆయన్ని నేను ఎప్పుడూ పూజించలేదే. ఆయన నాకెందుకు కనబడతాడు? ఆయన దేవుడా? దేవుడు మాట్లాడుతాడా? నేను ఇష్టపడి పూజించేవాళ్ళు కనబడాలి కాని, నేను ద్వేషించే యేసు సిలువ ఎందుకు కనబడింది. నేను ఎప్పుడూ తలచుకోలేదే? అలా రకరకాల ఆలోచనలతో ఆ రాత్రి నిద్రపట్టలేదు. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాను. నిజంగా యేసు దేవుడైతే, ఆ మాటలు నిజంగా దేవుని మాటలైతే 'నీవు నా దగ్గరకు రా' అనేది నా పని. నేను వస్తాను. 'నిన్ను రక్షిస్తాను' అనేది ఆయన చేయవలసిన పని. రక్షిస్తాను–అంటే నాకున్న సమస్యలు పరిష్కరిస్తే ఆయన దేవుడు అని నమ్ముతాను అనుకొన్న తర్వాత ప్రశాంతంగా నిద్రవచ్చింది.

అయితే ఇది జరిగిన తరువాత ప్రతిరోజు మార్పు కొరకు ఎదురు చూసేదాన్ని. ఆయన క్లబ్ నుండి ఆలస్యంగా వస్తుండేవాడు. దాదాపు 7 నెలల తర్వాత ఒకరోజు మా వారికి క్లబ్‌లో కార్డ్సు ఆడుతుండగా గుండె దగ్గర మంటగా ఉందని ఇంటికి వచ్చి వాళ్ళ క్లబ్‌లో ఒక ఇంజనీరు కార్డ్స్ ఆడుతుండగా హార్టెటాక్‌తో మరణించాడని, అది తన కళ్ళముందే జరిగింది కనుక తనకు భయంగా ఉందని, డాక్టర్‌ని పిలువమని చెప్పారు. డాక్టర్ పరీక్షించి గ్యాస్ట్రిక్ ట్రబుల్ వల్ల వచ్చిన మంట' అని చెప్పినను ఆయనకు భయం పట్టుకుంది. ఆ ఆలోచనలవల్ల ఆయన త్వరగా ఇంటికి రావడం మొదలుపెట్టారు. క్రమంగా క్లబ్‌లో ఉండే సమయం తగ్గిపోతూ వచ్చింది. ఒకరోజు అసలు వెళ్ళకుండా ఉన్నారు. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. నేను కారణం

అడిగినప్పుడు తనకు కార్డ్స్ పట్టుకోగానే ఆ రోజు సంఘటన గుర్తుకొస్తుందని ఇక నుండి సిగరెట్లు, కార్డ్స్ ఆడటం పూర్తిగా మానేస్తున్నాని చెప్పారు. ఆ రోజు నాకు ఎంతో సంతోషం కలిగింది. అయితే ఆయన క్లబ్‌కు వెళ్ళడం మానేస్తే నీవు దేవుడవని నమ్ముతాను అన్న నా మాటను నేను నిలబెట్టుకోలేదు.దేవుడైతే సత్యవంతుడు కాబట్టి ఇచ్చిన మాట నెరవేర్చాడు. కాని నేను మాట తప్పాను.

క్లబ్బుకి వెళ్ళటం మానేసిన తర్వాత మరణం గురించి అన్వేషణ ప్రారంభించారు నా భర్త. అనేకరకాల ఆలోచన లతో మనశ్శాంతి లేకుండా ఉండేవారు. అదేసమయంలో నా భర్త పినతండ్రి కుమారుడు చనిపోగ, మావారు ఆదరణ కూటమునకు వెళ్ళారు. అక్కడ పాస్టరుగారు 'ప్రభువుని నమ్మనివారు దేవుని దగ్గరకు చేరరు, ఈ చనిపోయిన వ్యక్తి ప్రభువును విశ్వసించలేదు కనుక దేవుని దగ్గరకు చేరుతాడని నేను చెప్పను. అతని గురించి ఏమీ చేయలేం. కాని, ఇక్కడు న్న మీ అందరూ ప్రభువు ద్వారానే పరలోకం చేరగలరు. లేనిచో నరకం తప్పదు' అని హెచ్చరించారు. ఆ మాట ఎంతో శ్రద్ధతో ఆలకించిన మా వారు ప్రార్ధనానంతరం పాస్టరుగారిని కొన్ని ప్రశ్నలు అడగగా పాస్టరుగారు 'మీ ఇంటి వద్ద చెప్తాను' అని అన్నారు. తర్వాత పాస్టరుగారు మా ఇంటికి రావడం మొదలుపెట్టారు. బైబిల్లోని అనేక విషయాలు మరణం, మరణం తరువాత జీవితం గురించి చెప్పేవారు. గ్యాస్ట్రిక్ ట్రబుల్ వచ్చినప్పటి నుండి ఉన్న అశాంతి ఆయనను వీడి, ప్రభువు మాటలవల్ల నెమ్మది, ధైర్యం, మరణం గురించి నిశ్చింత ఆయనకు కలిగింది. అది విని పాస్టరుగారు చర్చికి రమ్మని మా వారిని ఆహ్వానిం చి, విగ్రహారాధన చేయకూడదని, సత్యమైన దేవుడొక్కడేనని, ఆయన ద్వారానే రక్షణ అని విన్నప్పుడు మా వారు చర్చికి వెళ్ళటానికి ఇష్టపడి ఆ రాత్రి బైబిల్‌ను కొన్నారు.

మా వారు 'చర్చికి వెళ్తాను' అన్నప్పుడు నేను ఎంతో చింతించాను. 'మీరు వెళ్ళవద్దు, వెళ్తే మనకు మంచి జరగదు' అని బ్రతిమలాడాను. ఆయన వినలేదు. 'నిన్ను నేను చర్చికి రమ్మని చెప్పలేదు. నాకు నచ్చినది నేను ఆచరిస్తాను. నీకిష్ట మైనది నువ్వు నమ్ముకొని ఉండు' అని చెప్పారు. ఆయనకు దర్శనంలో ప్రభువు మాట్లాడారు. ఆయనలో మార్పు వచ్చింది. యేసును ప్రేమించవలసిన నేను ఇంకా వ్యతిరేకి స్తున్నాను. మా వారిని చర్చికి వెళ్ళకుండా ఆపాలంటే నాకు ఒక్కటే మార్గం కనబడింది. అదేమిటంటే పాస్టరుగారు మా దేవుళ్ళ మీద అంతా చెడుగా, లోపాలు చెప్పటం వల్ల - యేసు ఒక్కడే పరిశుద్ధుడని, పాపస్వభావం గలవారు పాపిని రక్షించలేరని చెప్పటం వల్లనే కదా ఇలా జరిగింది. వాళ్ళ దేవుడి గురించి నాకు తెలియదు కాబట్టి నేను మా వారు కొన్న బైబిల్లో యేసులో తప్పులు వెదకాలి అనుకొని, అంద రు దేవుళ్ళు తప్పులు చేసేవారైనపుడు యేసు అవసరం లేదని నిరూపించాలని, ఆ రాత్రి నుండి క్రొత్త నిబంధనను చదవాలని అత్యంత పట్టుదలతో, ప్రతిరోజు తెల్లవారు జామున 2 గం॥ల నుండి 4 గం॥ల వరకు చదివేదాన్ని. మొదట్లో ఇష్టంలేని పుస్తకం చదవాలంటే ఎంతో విసుగ్గా వుండేది. కాని యేసులో తప్పులు వెదకుటకు ఎంతో జాగ్రత్త గా చదవటం ప్రారంభించాను. బైబిల్లో ఏమి చదివినా ఆ మాటల సారాంశము నాకు తెలిసిన దేవుళ్ళకు పోల్చుకునే దాన్ని. పగలు పనిచేస్తున్నప్పుడు కూడా ఇదే ఆలోచన. పాస్టరుగారు చెప్పినదంతా నిజమని అర్ధమవుతుంది. అయినా నేను నా హిందూ ధర్మాన్ని విడువకూడదని, నా భర్తనే మా హిందూధర్మంలో ఉండేటట్లు చేయటానికే కదా నేను ఈ పుస్తకం చదువుతుందని, నా పట్టు సడలకుండా ఉండాలని నిశ్చయించుకున్నాను. ఈస్టర్ పండుగప్పుడు మా వారు బాప్తీస్మం తీసుకున్నారు. కొద్దికొద్దిగా యేసును అర్ధం చేసుకుంటున్న నేను అభ్యంతర పెట్టలేదు. నాలోని మార్పును గమనించిన పాస్టరుగారు నన్ను కూడ బాప్తిస్మం తీసుకొమ్మని అడిగారు. కానీ, నాకింకా సందేహాలున్నాయి అని చెప్పాను. యేసును గురించి తెలుసుకుంటున్న కొలది నా హృదయంలో ఆత్మీయపోరాటం జరుగుతోంది. బైబిల్లో దేవుడు ఎంతో ప్రేమగలవాడని, అందువల్లే పాపులకొరకు తన ప్రాణం పెట్టాడని తెలిసింది. "నేను పాపులను పిలువ వచ్చితిని గానీ నీతిమంతులను పిలువ రాలేదు గనుక

కనికరమునే కోరుచున్నాను గానీ బలిని కోరను" అన్నాడు. మరి మా గ్రంథాలలో నేను ప్రతి యుగాంతాన ఒక్కొక్క అవతారమెత్తి శిష్టరక్షణ, దుష్టశిక్షణ చేస్తానని వ్రాయబడి ఉంది. చెడ్డవారిని సంహరించి, భూమి భారము తొలగి స్తానని చెప్తుంది. యేసయ్య మాత్రం 'ఆరోగ్యవంతులకు వైద్యుడు అవసరం లేదు గానీ రోగులకే అవసరం కాబట్టి –పాపులకే క్షమాపణ అవసరం కాబట్టి తనంతట తానే పాపపరిహారార్ధ బలిగా సిలువ ఎక్కుతున్నాను' అని చెప్పాడు. "పాపపరిహారార్ధో రక్తప్రోక్షణం అవసరం తద్ రక్తం పరమాత్మానే పుణ్య దాన బలియాగం" అని హిందూ ధర్మ శాస్త్రాలు చెప్తుండగా, యేసు తప్ప–బలియై రక్తం కార్చి, చనిపోయి, తిరిగి లేచిన వారెవ్వరూ లేరని యేసు సత్యమైన దేవుడని క్షమించే దేవుడని గ్రహించాను. తనను సిలువలో అవమానించి, దూషించి, ఉమ్మివేసి, కొరడాలతో కొట్టిన వారిని సహితం క్షమించి వారి కొరకు ప్రార్ధించాడు. అంటే పాపిని శిక్షింపక రక్షిస్తున్నాడని, ఎంతో ద్వేషించే నన్ను ఎంతో ప్రేమించి, నా ప్రవర్తనకు విసుగక నేను సత్యము గ్రహించేలా చేస్తున్నాడని గ్రహించేకొద్దీ నా హృదయంలో యేసయ్యపై ఉన్న ద్వేషం పోయి రెట్టింపు ప్రేమ కలిగింది. నా కన్నుల వెంట కన్నీరు ప్రవిస్తుంది. యోహాను సువార్తలో "మీ హృదయమును కలవరపడ నియ్యకుడి. దేవునియందు విశ్వాసముంచుచున్నారు, నాయందును విశ్వాసముంచుడి" అన్నమాట ప్రకారం ఆయనయందు విశ్వాసం ఉంచాను. నా హృదయంలో ప్రభువును రక్షకునిగా అంగీకరించాను. నా అనుమానాలన్ని నివృత్తి అయ్యాయి కాబట్టి నేను బాప్తీస్మం తీసుకుంటానని మా వారితో చెప్పాను. ఆయన ఎంతో సంతోషించి పాస్టరు గారితో చెప్పి నేను ప్రభువును నా స్వరక్షకునిగా బహిరంగంగా ఒప్పుకొనుటకు సహాయపడ్డారు. ప్రభువును నా రక్షకునిగా అంగీకరించి ఆలయంలోకి ప్రవేశించాను. "నన్ను వెదకని వారికి నేను దొరికితిని" అని బైబిల్లో చెప్పబడినట్లు నేను యేసును వెదకనప్పటికీ ఆ ప్రభువు నాకు దొరికాడు. దేవునికి స్తోత్రములు!

**(9 వ పేజి తరువాయి...)**

యెహోవా సెలవిచ్చునదేమనగా – మీ ప్రవర్తనను గూర్చి ఆలోచించుకొనుడి. మీరు విస్తారముగా విత్తినను మీకు కొంచెమే పండెను. మీరు భోజనము చేయుచున్నను ఆకలి తీరకయున్నది. పానము చేయుచునున్నను దాహము తీరకయున్నది. బట్టలు కప్పుకొనుచున్నను చలి ఆగకున్నది. పనివారు కష్టము చేసి జీతము సంపాదించుకొనినను జీతము చినిగిపోయిన సంచిలో వేసినట్లుగా ఉన్నది.

నా మందిరము పాడైయుండగా మీరందరు మీ మీ ఇండ్లు కట్టుకొనుటకు త్వరపడుట చేతనేకదా?

మలాకీలో – పదియవభాగమును ప్రతిష్ఠితార్పణలను ఇయ్యక దొంగిలితిరి. పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొనిరండి. దాని చేసి మీరు నన్ను శోధించినయెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారముగా దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు. ఇశ్రాయేలుకు ఆధారమైనవాడు నరుడుకాడు. ఆయన అబద్ధమాడడు, పశ్చాత్తాపపడడు. 1సమూ. 15:29 దేవుడు అబద్ధమాడుటకు ఆయన మానవుడు కాడు. పశ్చాత్తాప పడుటకు ఆయన నరపుత్రుడు కాడు. ఆయన చెప్పి – చేయకుండునా? ఆయన మాట ఇచ్చి స్థాపింపకుండునా? సంఖ్యా 23:19.

పరిశుద్ధ గ్రంథము ఇంత సూటిగా, ఖచ్చితంగా చెప్తున్నా మనం దేవుని గురించి, దేవుని కార్యములను గురించి కాక లోక అవసరముల గురించి, లోకమును గురించి చింతిస్తూ దేవునిని ఆయన ఆజ్ఞలను నిర్లక్ష్యం చేస్తున్నామంటే, దేవునిని ఆయన మాటలున్న ఆయన గ్రంథమును మనం నమ్మనట్లే. చర్చికి వెళ్తున్నను, భక్తి ఆచారాలు అనుసరిస్తు న్నను విశ్వాసము లేనట్లే. క్రియలు లేని విశ్వాసము మృతము అని యాకోబు 3:17లో చెప్పబడింది.

కాబట్టి మన అవసరతల కంటే దేవుని పనులకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చి మన విశ్వాసాన్ని క్రియలలో చూపుదాం తద్వారా దేవుని నుండి ఆశీర్వాదాలు పొందుకుందాం!

చిన్నపిల్లల పేజి

# ఏలీయా

ఇశ్రాయేలు దేశాన్ని ఆసా తర్వాత అహాబు అనే రాజు పరిపాలించాడు. ఇతను దేవుని దృష్టిలో తన పితరుల కంటే ఎక్కువగా చెడుతనము జరిగించాడు. ఈ అహాబు మరో రాజుగారి కుమార్తెయైన యెజెబెలును పెండ్లి చేసుకున్నాడు. యెజెబెలు పూజించే అన్యదేవతలను తను కూడా పూజించేవాడు. యెజెబెలు ఆ దేశంలోని ప్రవక్తలను చంపదలచి తన దేశము నుండి 'బయలు' అను దేవతను పూజించే పూజారులను పిలిపించింది.

ఒకరోజు తన మందిరములోకి ప్రవేశించిన ఏలీయా ప్రవక్తను రాజు చూశాడు. దేవుడు రాజుతో మాట్లాడమని ప్రవక్తను పంపించాడన్నమాట. రాజు అతనితో నీకేమి కావాలి? అని అడగక ముందే ఏలీయా అహాబుతో 'ఇశ్రాయేలు దేవుడైన యెహోవా మాట ప్రకారము నీ రాజ్యములో మంచైనా, వర్షమైన పడదు' అని చెప్పి వెళ్ళిపోతాడు. ప్రవక్త చెప్పినట్లే వర్షము కురవక పోవడంతో కరవు వచ్చింది దాంతో రాజు ప్రవక్త మాటలు నెరవేరాయని గ్రహించి ఏలీయా కొరకు వెదకించాడు. అయితే ఏలీయా దేవుడు చెప్పినట్లు రాజుకు కనబడకుండా కెరీతు అను వాగు దగ్గర నివశించసాగాడు. దేవుడు ఏలీయా ఆకలి తీర్చడానికి కాకులను ఏలీయా యొద్దకు పంపాడు. అవి ఉదయం సాయంత్రం ఏలీయా వద్దకు వచ్చేవి వస్తూ వస్తూ వాటి నోటను మాంసం ముక్కలు రొట్టెముక్కలు తీసుకొని వచ్చేవి. ఏలీయా కాకులు తెచ్చిన మాంసము రొట్టె ముక్కలను తిని తన ఆకలి తీర్చుకొని ఆ వాగు నీరు త్రాగుతూ కొన్ని రోజులు జీవించాడు. చూశారా పిల్లలూ కాకులు దేవుని మాటకు ఎలా లోబడ్డాయో. దేవుడు చెప్పినట్లు అవి ప్రతి దినము ప్రవక్తకు ఆహారాన్ని అందించాయి. మనము అలానే దేవుని మాటకు లోబడాలి.

కొంతకాలానికి వాగు నీరు ఎండిపోవడంతో దేవుడు ఏలీయాను సారెపతు అనే ఊర్లోని ఒక విధవరాలి వద్దకు వెళ్ళమనెను. ఏలీయా దేవుడు చెప్పినట్లే సారెపతు అను ఊరిలోని విధవరాలి యొద్దకు వెళ్ళి త్రాగటానికి నీళ్ళు తినడానికి ఒక రొట్టెను ఇవ్వమని అడగగా, ఆమె అయ్యో నా యొద్ద కొంచెం పిండి, కొంచెం నూనె తప్ప ఏమి లేవు. అవి నాకు నా కొడుకుకు ఈ రోజు రొట్టె చేసుకొనుటకు మాత్రమే సరిపోతాయి అన్నది. అందుకు ఏలీయా భయపడవద్దు ముందు నేను చెప్పినట్లు నా కొరకు ఒక రొట్టె తీసుకొని రా, తరువాత నీ కొరకును నీ కుమారుని కొరకు చేసుకొనవచ్చు. భూమి మీద యెహోవా వర్షము కురిపించు వరకు ఆ తొట్టెలో ఉన్న పిండి తక్కువ కాదు. ఆ బుడ్డిలో నూనె అయిపోదని ఇశ్రాయేలు దేవుడైన యెహోవా సెలవిచ్చుచున్నాడని చెప్పగా ఆ విధవరాలు ఇంకేమి ఆలోచించక ప్రవక్త చెప్పినట్లు చేసింది. అప్పుడు ఆ విధవరాలి వద్దనున్న పిండి, నూనె అయిపోలేదు. అంతేకాదు దాదాపు కరువుకాలము తీరేంతవరకు ప్రవక్తతో పాటు ఆమె ఇంటి వారందరూ ఆ కొంచెం పిండి, బుడ్డిలోని ఆ కొంచెము నూనెతోనే తమ ఆకలి తీర్చుకున్నారు.

ఎంత ఆశ్చర్యమో కదా! దేవుడు తన బిడ్డలను గూర్చి ఎంత శ్రద్ధ వహిస్తున్నాడో కదా! దేశమంతా కరువుతో ఇబ్బంది పడుతున్నప్పటికి దేవుడు తన బిడ్డలను రకరకాల పద్ధతులలో పోషించాడు. అలాగే సారెపతు విధవరాలు కూడా ప్రవక్త మాటలు మీద నమ్మకముంచి ప్రవక్త చెప్పినట్లు చేసింది. ఫలితంగా దేవుని అద్భుతాన్ని చూసింది దేవుని గ్రంథములో స్థానం సంపాదించినది. మనము కూడా దేవుని మాటలున్న పరిశుద్ధ గ్రంథమును నమ్మి దేవుడు చెప్పినట్లు చేసి దేవుని ఆశ్చర్యకార్యాలను, అద్భుత కార్యములను మన జీవితాలలోను చూడవచ్చును.

# కృపాదానం

1

జోసఫ్ అక్కమ్మ దంపతులకు 1912లో కృపాదానం జన్మించారు. కృపాదానం జన్మించే నాటికి ఒంగోలులో మిషన్ హాస్పిటల్ కట్టబడలేదు.

నాటి మిషనెరీ అయిన క్లౌ దొరగారు 1910లో న్యూయార్కులో మరణించారు. అందువలన బేకరు దొర మిషనెరీ అయ్యారు. 1900వ సంవత్సరం వరకు ఒంగోలులో రైలు లేదు. మద్రాసు నుండి ట్రాక్ వేస్తూ ఒంగోలు చేరే నాటికి 1900వ సంవత్సరం అయింది.

కావలి నుండి సముద్రము ప్రక్కగా రైల్వే ట్రాక్ నిర్మాణంలో ఉన్నది. రైల్వే ట్రాక్ కావలి నుండి తెట్టు పాకల, అల్లూరు మీదుగా చీరాలకు వేయవలసి ఉండగా ఒంగోలులో నివశిస్తున్న ఇంగ్లాండు దొరలు తమ దేశపు రాణిగారితో మాట్లాడి ఒంగోలు మీదుగా తీసుకువచ్చారు.

ఒంగోలులో రైల్వేస్టేషన్, పెద్ద పెంకుటిల్లు. కరెంటు లేదు. అందువలన నాలుగు పెద్ద పెట్రోమాక్సు లైట్లను వెలిగించి, స్తంభాల మీదుగా వైరులతో పైన కట్టేవారు.

అప్పటి ఒంగోలు గ్రామంలో రంగారాయుడు మంచి నీళ్ళ చెరువు, స్టేషన్‌కి 3 కిలోమీటర్లు దూరంలో ఉండేది. రైల్వేస్టేషన్‌కు రావాలంటే ఒంటెద్దు బండ్లు మాట్లాడుకోవాలి. చీకటి పడితే నిర్మానుష్యం. స్టేషన్‌కి దగ్గరలో అయ్యన్న అనే మద్రాసు సెట్టిగారు ఒక పెద్ద సత్రం పెట్టి అందులో కోనేరు త్రవ్వించాడు. ఆయనే బేకరు దొరగారు కడుతున్న పెద్ద హాస్పిటల్‌లో ఒక సత్రం కట్టించారు.

ఆ కాలంలో కనిగిరి ఆ పై ప్రాంతాల నుండి దొరలు ఒంగోలుకు నడిపించిన నిమ్న కులస్తుల కొరకు రైలు స్టేషన్‌కి తూర్పున రెండు చిన్న పాళెంలు కట్టించారు. తూర్పున తూర్పు పాళెం ఉండేది. పడమర కబాడి పాలెం ఉండేది. ఈ రెండింటికి మధ్యలో చర్చి పాస్టరు గారిల్లు, హెడ్‌మాస్టరు గారి ఇల్లు ఉండేది.

మిషన్ హాస్పిటల్‌లో పనిచేయుటకు తర్ఫీదు పొంది వచ్చిన వారికి కూడా ఇండ్లు కట్టించారు. పాస్టరుగారి ఇంటికి దగ్గరలో కట్టబడిన నాల్గవ ఇల్లు కృపాదానం తండ్రి జోసఫ్ గారిది.

క్లౌపేట మొత్తం పది ఇండ్లు. మిగతా ప్రదేశమంతా నాగజెముడు చెట్లతో నిండివుండేది. ఇప్పుదు అయిదు వందల రూపాయల నోటుకు ఉండే విలువ నాడు ఒక్క రూపాయి నోటుకు ఉండేది. ఒక్క రూపాయికి 16 అణాలు, అణాకి నాలుగు కానీలు, ఒక్కొక్క కాని ఇప్పటి రూపాయిగా చెలామణి అవుతుంది అనుకోవచ్చు.

కృపాదానం అవ్వ, తాతలు కనిగిరికి 23 కిలోమీటర్ల దూరములోని నెల్లూరుజిల్లా వెలిగండ్ల గ్రామములో జీవి స్తుండగా క్లౌదొర వాక్యపరిచర్య ద్వారా తరలి వచ్చిన అనేక దళిత కుటుంబాలలో కొడవటికంటి నాగభూషణం పోలయ్యగారి కుటుంబం ఒకటి.

పోలయ్య గారు మిగిలిన కుటుంబ ాలకంటే ముందే ఒంగోలు వచ్చి ఉండడంవల్ల , హైస్కూలు హెడ్‌మాస్టరు, చర్చి పాస్టరుగార్లకు కేటాయించిన చోటనే అంటే అతి ముఖ్యమైన వారికి ఇచ్చే స్థలంలో పోలయ్యకు ఇంటి స్థలం కేటాయించబడింది. అంటే నాటి క్లౌపేట మొత్తం 12 ఇండ్లలో మూడవ ఇల్లుగా కొడవటికంటి పోలయ్యకు స్థలం కేటాయించబడింది పోలయ్య క్లౌ దొరగారింట్లో పనిచేస్తూ చేదోడు వాదోడుగా ఉండేవాడు. దొరగారి మనిషి అనే ఒక హోదా ఉండేది కాని అతి బీదలు. ఆయన కుమారుడు జోసఫ్ కోపిష్టి. దొరగారితో సంబంధం లేకుండా ఉండే

వాడు. జోసఫ్‌గారి పెద్దకుమారుడు ఆశీర్వాదం చిన్నతనం నుండి చదువుకుంటూ దొర చేత మెప్పు పొందాడు. కృపాదానం తల్లి కుమ్మరకుంట అక్కమ్మగారు, పందువ నాగులారము నుండి వచ్చింది. జోసఫ్ అక్కమ్మలకు 15 మంది సంతానం. బ్రతికి బట్ట కట్టింది ఐదుగురే. వారిలో ఇద్దరు మగపిల్లలు ముగ్గురు ఆడపిల్లలు.

అందరికంటే పెద్దవాడు ఆశీర్వాదము తర్వాత

ముగ్గురు ఆడపిల్లలు. చివరిలో కృపాదానం జన్మించాడు. తొలిచూలు కుమారుడు పుట్టినప్పుడు చేటలో శిశువును పెట్టి పెంటకుప్ప మీద పెట్టి లోపలికి తెచ్చినందున పెంటయ్య అని పేరుపెట్టారు. తర్వాత కాలంలో ఆశీర్వాదము అని పేరు పెట్టారు. కృపాదానం ఆఖరివాడుగా జన్మించాడు. తన అన్న కంటె 15 సంవత్సరముల చిన్నవాడు. ముగ్గురు అక్కల కంటే కూడా చాలా చిన్నవాడైనందున తల్లితో సాన్నిహిత్యం ఎక్కువ. తండ్రి కంటె తల్లి దగ్గరనే చనువు ఎక్కువ. తల్లి అక్కమ్మ ప్రార్థనాపరురాలు. తల్లి ప్రార్థనా జీవితం కృపాదానం జీవితంపై ఎంతో ప్రభావం చూపింది. చిన్ననాటి నుండి ప్రార్థన శక్తిని ఆశ్రయించటకు కారణం తల్లి అక్కమ్మ గారే.

చిన్నదానికి పెద్దదానికి తండ్రి జోసఫ్ బహుగా దండించేవాడు. ఉదాహరణకు రెండు దమ్మిడీలకు గోంగూర తెమ్మని అర్ధ అణా ఇచ్చి మార్కెట్‌కు పంపిస్తే కానీకి గోంగూర తెచ్చాడు. అర్ధ అణాకి రెండు దమ్మిడీలు. ఇంటి వద్ద తండ్రి జోసఫ్ ఆ తప్పుకు అరగంట కొట్టాడు. తర్వాత వారం రోజుల వరకు ఆ సంగతి ఆయనకు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా కృపాదానం అందుబాటులో ఉంటే ఒక దెబ్బ వేసేవాడు. అందువలన చిన్నప్పటి నుండి తల్లిచాటు బిడ్డగా పెరిగాడు. చదువులో రాణించాడు. కాని సన్నగా ఉన్నందున ఆటలలో గెలవలేదు.

మొత్తానికి పదిమందిలో జ్ఞాని అని కాని, మాట పలుకుబడి ఉన్న వాడుగా గాని గుర్తించబడలేదు. తల్లి ప్రోద్భలంతో ప్రతి చిన్న విషయానికి దేవునితో సహవాసంలో గడప నిశ్చయమైనది. దేవునితో సహవాసం ప్రార్థన కూడా ఒక మూర్ఖంగా వెంబడించినట్లు అనిపించేది నాకు. అలాకాకపోతే 45 సంవత్సరముల వయస్సులో పదిమంది సంతానముతో చుట్టుప్రక్కల మనుష్యులకు మిషనరీలకు వ్యతిరేకముగా భార్యతో కలిసి ఉద్యోగాలను వద్దని దాదాపు మూడున్నర సంవత్సరములు కుటుంబం మొత్తాన్ని పస్తులతో ఉంచాడు. చుట్టుప్రక్కల జనముకు కృపాదానం భార్య తరపున బంధుజనానికి కృపాదానం వ్యర్థునిగా కనిపించేవాడు. ఆ మూర్ఖత్వమే యేసును గట్టిగా పట్టుకోవడానికి కారణమైనది.

నా సేవా కార్యక్రమములో నేను చూచిన కుటుంబములు నాకు తెలిసిన కుటుంబములలో కుమారులు పెద్దయిన తర్వాత పూర్తిగా చేతికందకుండా వేదన కారకులుగా మారటానికి కారణం తల్లిదండ్రులు ఆ పిల్లల చిన్నతనములో దుర్మార్గంగా ప్రవర్తిస్తే సంతోషించి ప్రోత్సాహ పరచటం. చాలామంది పిల్లలకు చదువు అబ్బకపోవటానికి కారణం వారిని చిన్నతనం నుండి నువ్వు మొద్దువి మొద్దువి అని అనడం. కాని కృపాదానం తల్లి అక్కమ్మగారు, అందరు తల్లులవలె కాక తన కుమారుని దైవసేవకుడిగా అర్పించుకొన్నది. ప్రభువు ఏ మంచి అప్లికేషన్‌ను త్రోసివేయదుకదా!

చాలామంది పెద్దపాస్టర్లు సేవ కొరకు విదేశాల నుండి డబ్బును ఆశించి, తెలివితేటలతో కేవలం అబద్ధాలను చక్కగా అల్లగల తెలివితేటలతో ధనవంతులై, పిల్లలు పెద్దయిన తర్వాత వారిని సేవకులుగా చెయ్యటం చిన్నతనం అనుకుంటారు. ఎందుకంటే వారు యదార్థమైన సేవకులు కారు. దైవసేవకులు అనబడే గొప్ప పదవి యొక్క ఔన్నత్యం తెలియక మీ అబ్బాయిని సేవకు ఇవ్వలేదా? అంటే వానికి ఇష్టమైతే మాకు ఇష్టమే అని అనుట వారిది కపటమైన మనస్సు అనుటకు తార్కాణం. అది యేసుకు తెలియదా?

కృపాదానం పదిమంది పిల్లలతో సేవ ప్రారంభించి పన్నెండుమంది సంతానమైన తర్వాత బీదరికములోనే విశ్వాససేవ చేసే రోజులలోనే తన 12మంది పిల్లలు సేవకులు అన్నాడు. అది మూర్ఖత్వము అన్నారు పెద్దలు, ప్రముఖులు. వీరంతా దేవుని ఎరిగినవారు కారు. దేవుని వీరే సృష్టించినట్లుగా దేవుని శక్తికి కొలతలు పెట్టేవారు. యేసుప్రభువు ఈ లోకములో తన 70మంది శిష్యులను పిలిచి కోత విస్తారముగా ఉన్నది గాని పనివారు కొద్దిమంది యే అని లూకా 10:2 అన్నాడు కదా.

ఆనాడు కృపాదానం ఒక్కడు. ఒక్కడే సేవ కొరకు భార్యను కోరుకొని పని ప్రారంభిస్తే నేడు కృపాదానం ఆయన బిడ్డలు మనుమలు, ముని మనుమలు దాదాపు 200 మంది సేవకులైయున్నారు.

బలవంతులైన వారిని సిగ్గుపరచుటకు లోకములో బలహీనులైనవారిని దేవుడు ఏర్పరచుకొనియున్నాడు అనుటకే ఇదే నిజ ఉదాహరణ.

# సాక్ష్యము

నా పేరు ఈదర యేసుదాసు. మాది ప్రకాశం జిల్లా కుంకలమర్రు గ్రామము. నేనొక నామకార్థ క్రైస్తవ కుటుంబములో పుట్టినాను. "నేను పాపములో పుట్టిన వాడను, పాపములో నా తల్లి గర్భము ధరించెను" అని భక్తుడైన దావీదు ద్వారా పలుకబడినట్లు నేను చిన్నతనం నుండి తలంపులలోను, చూపులలోను, క్రియలలోను పాపస్వభావముతోనే జీవించాను.

నేను హైస్కూల్ విద్య కొరకు బాపట్లలో చదువుతూ, సినిమాలు విరివిగా చూస్తూ తల్లిదండ్రులను, వార్డెన్‌గారిని మోసం చేస్తూ పైకి మాత్రం మంచి వాడుగా కనిపించే వాడను. కాలేజిలో చేరిన తర్వాత బి.ఎ. రెండవ సంవత్సరం చదువుతుండగా కమ్యూనిస్టు పార్టీ విప్లవ భావాల పట్ల ఆకర్షితుడనై, కాలేజిలోని రాడికల్స్‌తో సంబంధాలు పెంచుకున్నాను. అప్పటి నుండి నేను కమ్యూనిస్టు సాహిత్యం కార్ల్‌మార్క్స్ ఏంజిల్స్, లెనిన్, మావో మరియు విప్లవ రచయితల పుస్తకాలను వాటితో హేతువాద సాహిత్యం పుస్తకాలను క్లాసు పుస్తకాల కంటే ఎక్కువ ఆసక్తితో చదివేవాడను. ఆ కారణంగా కమ్యూనిస్టు భావాలతో పాటు దేవుడు లేడనే భావనలు కూడా నాలో బలంగా చోటు చేసుకున్నాయి. ఆ సమయానికి మా అన్నయ్య దేవుని సేవలో నమ్మకముగా ఉంటూ స్థానికంగా సంఘ కాపరిగా ఉన్నందు వలన అనేక మంది క్రైస్తవులు దైవజనులు మా ఇంటికి వస్తుండేవారు. వారు ఎవరైనా నాకు దేవుని గురించి చెబితే హేతువాద ప్రశ్నలతో వారిని ఎదిరించేవాడను. అలాగే కాలేజి హాస్టల్‌లో కూడా ఎవరైనా భక్తి కలిగినా సహోదరులు దేవుని మాటలు చెబితే వారిని ఎదిరించే నాస్తికులకు నాయకుడిగా ఉండేవాడను.

ఈ విధంగా దేవునికి వ్యతిరేకముగా జీవిస్తూ రాడికల్ కార్యాకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ విప్లవ రచయితా, గాయకుడు అయిన గద్దర్ పాటలు పాడుతూ, వాటికి తగినట్లు నాట్యాలు చేస్తూ అనేక ప్రాంతాల్లో తిరిగాను. చివరకు ఎమర్జెన్సీ కాలంలో అండర్ గ్రౌండ్‌కి వెళ్ళాలని ప్రయత్నించాను. నా ప్రవర్తనను గమనించిన మా అన్నయ్య నా బి.ఏ. పూర్తికాగానే దేవునియందు భయభక్తులు కలిగిన అమ్మాయితో నాకు వివాహం చేశాడు. నా భార్య, అన్నయ్యల బలవంతము మీద ప్రార్థనా కూడికలకు వెళ్ళేవాడను. కానీ నాకు దేవుని మీద నమ్మకం ఉండేది కాదు. వీరికి తెలియకుండా విప్లవ కార్యాకలాపాల్లో పాల్గొనేవాడను. నా భార్య, అన్నయ్య అనుదినం నా కొరకు కన్నీటితో ప్రార్థించేవారు.

ఒకసారి నాకు అకస్మికముగా వెన్నెముకలో తీవ్రమైన భరించలేని నొప్పి వచ్చింది. అప్పుడు నెల రోజుల దాకా కదలనీయకుండా, నడవనీయకుండా, కనీస అవసరాలకు చాలా కష్టంగా మెల్లగా నడిచేవాడను. అప్పుడు నేను ఎముకల వైద్యుని వద్దకు వెళ్ళాము. ఆయన నాకు పరీక్షలు చేసి ఎక్స్‌రే తీసి వెన్నెముకలో రంధ్రాలు ఏర్పడి వాటిలో నీరు చేరిందని ఇంకా ఆలస్యం చేస్తే అది చీముగా మారుతుందని, కనీసం నెలరోజులు హాస్పిటల్‌లో చేరి ఎటూ కదలకుండా మందులు వాడితే నయం అవుతుందని చెప్పి తాత్కాలికంగా నొప్పి తీవ్రత తగ్గడానికి మందులు ఇచ్చాడు. ఆ మందులు వాడినా నొప్పి కొంచెం కూడా తగ్గలేదు.

ఆ సమయంలో చీరాల మిషన్ కాంపౌండ్‌లో విదేశీ మిషెనరీలు స్వస్థత సభలు నిర్వహించారు. ఆ సభలకు వెళ్ళుటకు నా భార్య బలవంతము చేయగా నా బాధను బట్టి వెళ్ళాను. సందేశం ముగిసిన వెంటనే స్వస్థత ప్రార్థనలు చేసే సహోదరితో నా సమస్య చెప్పగా ఆమె నా తల నుండి పాదముల వరకూ స్పర్శిస్తూ కన్నీటితో ప్రార్థన చేసింది. వెంటనే నా బాధ నివారణ అయినదని గ్రహించాను. వెంటనే నా జేబులో ఉన్న డాక్టరు వ్రాసిన మందులు విసిరి

పారేశాను. నడుచుటకు, పరుగెత్తుటకు నాకు నొప్పి ప్రభావం కనిపించలేదు. అప్పుడు నాకు దేవుని మీద నమ్మకం కలిగింది. అయితే నేను బలమైన పనులు చేయబోతే ఆ నొప్పి ప్రభావం కనిపిస్తున్నది. ఈ విషయమై మా అన్నయ్యతో చెప్పగా ఆయన సామెతలు 3:7 చదవమనగా "యెహోవాయందు భయభక్తులు కలిగి చెడుతనము విడిచి పెట్టుము, అప్పుడు నీ దేహమునకు ఆరోగ్యము నీ ఎముక లకు సత్తువ కలుగును" అని చదివినప్పుడు దేవుడు నా పరిపూర్ణ ఆరోగ్యం కొరకు నాకు టానిక్ ఇచ్చినట్లుగా ఉంది. వెంటనే నా పాపముల కొరకు పశ్చాత్తాప పడి దేవుని యొద్ద క్షమాపణ కొరకు వేడుకున్నాను. దేవునికి విరోధమైన ప్రతి పాపమును ఒప్పుకొని, ఇతరులతో సరి చేసుకొని 1యోహాను 1:9 ప్రకారం ప్రేమగల దేవుడు నా పాపములు పరిహరించాడని నమ్మాను.

ప్రియుడా నీ ఆత్మ వర్ధిల్లుచున్న ప్రకారము నీవు అన్ని విషయములలో వర్ధిల్లుదువని వాక్యము చెప్పబడిన రీతిగా నాకు దేవుడు పరిపూర్ణ ఆరోగ్యం ఇచ్చాడు. ఇప్పుడు నేను అన్ని రకముల పనులు చేయగలుగుతున్నాను. నేను నా కుటంబం నిజమైన శాంతి సమాధానం అనుభవించు చున్నాము

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసములో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్య మైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషముగా పత్రికా ముఖముగా ప్రచురించుటకు మేము సిద్ధముగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు కూడా పాలిభాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# సిద్ధపాటు

**తన వద్దకు వచ్చిన అనేక మంది నిస్సహాయులను చూచి**
**వారి దీన స్థితిని చెప్పకనే గాంచి,**
**అనేక సంగతులను వారికి బోధించి,**
**శారీరికంగా ఆత్మీయంగా వారిని స్వస్థపరచి,**
**వారిని తండ్రికి, తన వారసత్వానికి దగ్గర చేసాడు మన ప్రభువు...**

**నేడు నీ నా చుట్టూ విస్తార జనసమూహం,**
**బడుల్లో గుడుల్లో వీధుల్లో వాహనాల్లో,**
**ఉత్సవాలలో, ఊరేగింపుల్లో, కార్యలయాల్లో, కారాగారాలలో,**
**విందుల్లో, విహారాల్లో, విలాసాల్లో,వినోదాల్లో,**
**గుంపులుగా గ్రూపులుగా ఉన్మాదులై ఉద్యమకారులై,**
**మతం పేరుతో మారణహోమాన్ని సృష్టిస్తూ,**
**మద్యం మత్తులో, సుఖభోగాలలో, భోగేచ్ఛలలో తేలుతూ..**

**కాపరిలేని గొర్రెలై చెదరిన మందలై**
**దేవుని ఎరుగని జనమై, అవిధేయులై**
**పాపనియమమునకు కట్టుబానిసలై**
**పాపంలోనే మరణిస్తున్న నీ వంటి, నీతోటి సహోదరుణ్ణి/**
**సహోదరిని ఆదరించలేవా?**
**ఆత్మల కాపరి చెంతకు నడిపించలేవా?**

**కోత విస్తారమే కానీ, పనివారు కొద్దిమందైన వేళ,**
**పనివారకై ప్రార్థింపలేవా? పనివానిగా నువ్వు మారలేవా?**
**తడవెందుకు? తటస్థ వైఖరెందుకు?**
**ఆయన రాకడ సూచనలెన్నో అగుపడుతుండగా**
**నిర్లక్ష్యమెందుకు?**

**ధనసంపాదనలో ఆస్తి సేకరణలో కాలహరణెందుకు,**
**అపవాది సైతం సమయం కొంచమేనని**
**ఎరిగి ప్రబలంగా పనిచేస్తుంటే,**
**సోమరివై నిద్రమత్తులో జోగుతావెందుకు?**

**నశించిన ఆత్మలను గూర్చిన లెక్క అప్పచెప్పవలసిన**
**సమయమొకటున్నదని గుర్తుంచుకున్నావా?**
**ఇహలోకంలో నీకున్న భోగభాగ్యాలను చూసి**
**మురిసిపోతూ మరచిపోయావా?**

**ఉగ్రతదినం వచ్చువేళయింది కనుక**
**తక్షణం చేయాలి మన పని ప్రారంభం,**
**కారాదు ఆరంభశూరత్వం, కావాలి ఆత్మల తీవ్రత్వం**
**పోవాలి మనలోని మందభాగ్యత్వం, అందుకోవాలి జీవకిరీటం,**
**ఆయన సింహాసనంలో కొద్దిగ స్థానం.....**

సి. షెఫేలా, దొనకొండ

# లోకంతీరు 3

**(పుట్టుక చావు మధ్య సంబరం)**

**నీ చేతిపనియైన నీ ఆకాశములను నీవు కలుగజేసిన చంద్రనక్షత్రములను నేను చూడగా నీవు నరపుత్రుని దర్శించుటకు వాడేపాటివాడు?**

అంటే రోజులో కాసేపు బైబిలు చదవటం, ప్రార్థన చేసుకోవటం, ఆదివారం చర్చికి వెళ్ళడం, దశమ భాగము ఇవ్వడం, ఏదైనా మేలు జరిగినప్పుడు కృతజ్ఞతా కూటం పెట్టుకోవడం, ఏదైనా కష్టం వస్తే ఉపవాస ప్రార్థనలు చేయటం వరకు మాత్రమే పరిమితం చేస్తారు. తమ జీవితంలో దేవునికి పూర్తి అధికారం ఇవ్వరు. అంటే ప్రతి చిన్న విషయానికి దేవునికి అధికారం ఇవ్వరు. దేవుడు వాళ్ళ జీవితంలో ఒక భాగంగా పరిగణించరు. దివారాత్రములు ధ్యానించేటంత ప్రాధాన్యత దేవునికి ఇవ్వరు. అలాంటప్పుడు వాళ్ళ జీవితాల్లో జరిగే మేళ్ళు కూడా పరిమితంగానే ఉంటాయి. మనిషి పూర్తిగా దేవుని మీద ఆధారపడి, వాళ్ళ జీవితాల్లో దేవుని చిత్తానికి చోటు ఇవ్వాలని దేవుడు కోరు కుంటాడు. మనిషి కోరితే వాళ్ళ పూర్తి జీవితాన్ని దేవుడే నడిపించాలకుంటాడు. ఇశ్రాయేలీ యులు దేవున్ని కాకుండా వాళ్ళ ముందర పోవడానికి ఒక రాజుని కోరుకున్నప్పుడు దేవుడు పక్కకి తప్పుకున్నాడు. అంటే ఒక మనిషి తన జీవితాన్ని ఎలాగైనా మలుచుకొనే పూర్తి అధికారం దేవుడు మనిషికి ఇచ్చాడు. దేవా, నా జీవితాన్ని నువ్వే నడిపించయ్యా అని అడిగితే దేవుడు తప్పకుండా నడిపిస్తాడు.

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

మరి దేవునికి ఎలాంటి ప్రత్యామ్నాయం లేకుండా వుంటే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఇష్టమున్నా లేకున్నా దేవున్ని ఆశ్రయించాల్సిందే కదా! అందుకే దేవుడు డబ్బుని తనకు ప్రత్యామ్నాయంగా సృష్టించుకున్నాడు. డబ్బు అంటే ఏంటి? మనం ఇప్పుడు ఉపయోగిస్తున్న ఈ కరెన్సీ, నాణేలు, వెండి, బంగారము కాదు. డబ్బు అంటే మనిషి ఆధారపడ టానికి ఒక ఆసరా. కాబట్టి ప్రతి మనిషి ఈలోకంలో బ్రతకటానికి ఆసరాగా దేవున్ని కాని, డబ్బుని కాని ఎన్నుకో వాల్సిందే. ఈ లోకంలో ప్రతి మనిషి డబ్బు లేనిదే జీవించలేడు అన్న భావం ప్రతి ఒక్కరిలో బలంగా నాటుకుపోయింది. డబ్బు సంపాదనే ఏకైక లక్ష్యం అదే జీవిత పరమావధి అనే వాదం ప్రతి ఒక్కరిలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. డబ్బే మనిషిని నడిపించే ఏకైక సాధనం అని గట్టిగా నమ్ముతారు. డబ్బుకోసం ఏమైనా చేయడానికి సిద్ధపడతారు. ఇంకా సిగ్గుపడాల్సిన విషయం ఏమిటంటే దేవుని సేవకులు, అంటే దేవుని పని చేసేవారు సైతం దేవుని పని చేయడానికి మనుష్యుల మీద ఆధారపడతారు. ఎవరైనా డబ్బులు ఇస్తే దేవుని సేవ చెయ్యాలి అనుకుంటారు. దేవుని పని చేస్తాము డబ్బులు ఇవ్వండి అంటూ మనుష్యులను నానారకాలుగా ప్రేరేపిస్తుంటారు. ఎవరైనా డబ్బులు ఇస్తే దేవుని పని చేయడంలో గొప్పతనం ఏముంది. ఎవరికి వాళ్ళు కష్టపడి పనిచేసి సంపాదించిన డబ్బుతో వారే దేవుని పని చేస్తే కదా దేవున్ని ప్రేమించడం. పోనీ, తను చేసే దేవుని పనికి దేవుడే ఇవ్వాలి అని ఎవరినీ ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కాని డబ్బులు అడగకుండా వుంటే దేవుడు ఎవరినైనా ప్రేరేపించి డబ్బులు ఇవ్వడా? మనం ప్రేరేపించి డబ్బులు ఇచ్చేటట్లు చేసేదానికి, వారంతట వారు అడక్కుండా ఇచ్చే దానికి తేడా లేదా? డబ్బు లేకపోతే జరగని పని దేవుని పనా? డబ్బులు దొరకలేదని టెన్షన్ పడుతూ దేవుని పని చేయటం, అప్పులు చేసి దేవుని పని చేయటం దేవుడు అంగీకరిస్తాడా? దేవుని పని చేసేవారు ఎప్పుడూ ప్రశాం తంగా, ధైర్యంగా వుండాలి. ఎలాంటి టెన్షన్స్ లేకుండా దేవుని పని చెయ్యాలి. లగ్జరీకి అలవాటు పడి దేవుని పని చేసేవారు, ఆ లగ్జరీని కాపాడుకోడానికి దేవుని పనినే అడ్డం పెట్టుకో వాల్సిన పరిస్థితి వస్తుంది. అప్పుడు వారు అక్రమము చేయు వారి జాబితాలో

చేరిపోతారు. ("ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింప లేదా? నీ నామమున దయ్యములను వెళ్ళగొట్ట లేదా? నీ నామమున అనేకమైన అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను – నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్ద నుండి పొండని వారితో చెప్పుదును" మత్తయి 7:22,23). ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా నుండనేరడు. మీరు దేవునికిని సిరికిని దాసులుగా నుండనేరరు అని దేవుడు చెప్పాడు. అంటే ఎవరు కూడా దేవున్ని డబ్బుని ఒకేసారి ప్రేమించలేరు. దేవున్ని ప్రేమించేవారు డబ్బుని ప్రేమించరు. డబ్బుని ప్రేమించేవారు దేవున్ని ప్రేమించలేరు. ఈ లోకంలో మన అవసరాలన్నీ తీర్చుకోడానికి ఖచ్చితంగా డబ్బు అవస రమే. ఏదెను తోటలో మంచిచెడ్డల తెలివినిచ్చే చెట్టును వేసింది దేవుడే, అయితే దాని జోలికి వెళ్ళవద్దని ఖచ్చితంగా చెప్పాడు. అలాగే ఈ లోకంలో డబ్బును ప్రవేశపెట్టింది దేవుడే. అయితే డబ్బు మీద ఆధారపడవద్దు అని, డబ్బును ప్రేమించవద్దని దేవుడు చెప్తున్నాడు. అయితే మనిషి డబ్బుకోసం దేవున్నే లెక్క చెయ్యడం లేదు. డబ్బు సంపాదన కోసం అనేక రకాలుగా అన్వేషణ చేస్తున్నాడు. మనిషిని సృష్టించిన దేవునికి మనిషి అవసరాలను తీర్చకుండానే ఉంటాడా? మనిషి ప్రాథమిక అవసరాలు దేవుడు తప్పకుండా తీరుస్తాడు (ఏమి తిందుమో యేమి త్రాగుదుమో అని మీ ప్రాణమును గూర్చియైనను, యేమి ధరించుకొందమో అని మీ దేహమును గూర్చియైనను చింతింపకుడి... ఆహారము కంటే ప్రాణమును, వస్త్రముకంటే దేహమును గొప్పవి కావా... ఎవడు చింతించుట వలన తన యెత్తు మూరెడెక్కువ చేసికొనగలడు?... మొదట ఆయన రాజ్యమును నీతిని వెదకుడి అప్పుడవన్నియు మీకు అనుగ్రహించబడును. మత్తయి 6:25-30). అయితే మనిషి దేవుని రాజ్యమును వెదకకుండా తన లగ్జరీ అవసరాలకోసం (టి.వి., ఫ్రిజ్, కారు, బంగళా, బ్యాంకు బ్యాలెన్స్, వగైరా వగైరాలు) డబ్బు సంపాదనే ధ్యేయంగా జీవిస్తున్నాడు. దేవున్ని అడిగితే ఏదైనా అనుగ్రహిస్తాడుగానీ, వాటి వలన వచ్చే కష్టనష్టాలకు మనిషే బాధ్యత వహించాలి. మనిషి జీవితం సంతోషంగా, సమాధానంగా సాగిపోవాలంటే దేవున్ని ఆశ్రయించటం తప్ప వేరే మార్గం లేదు. (ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి తమ్మును తామే పొడుచుకొనిరి. 1 తిమోతి 6:10; ధనాపేక్ష లేనివారై మీకు కలిగిన వాటితో తృప్తి పొందియుండుడి. హెబ్రీ 13:5; ధనవంతులగుటకు అపేక్షించువారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తము లును, హానికరములునైన అనేక దురాశలలోను పడుదురు. 1తిమోతి 6:9;). మనం డబ్బు సంపాదించడానికి కారణం మన అవసరాలే కదా! మన ప్రతి అవసరాన్ని దేవుని యెదుట బలిపీఠం మీద బలివ్వాలి.

> **చా వు**
>
> **ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

మనందరం చస్తాము అని తెలిసీ కూడా దేవున్ని లెక్క చెయ్యము. వెర్రివాడా, ఈ రాత్రి నీ ప్రాణము అడుగుచున్నారు, నీవు సిద్ధపరచినవి ఎవనివగును అని దేవుడు అడుగుతాడు. దేవుని యెడల ధనవంతుడు కాక తనకొరకే సమకూర్చు కొనువాడు అలాగుననే ఉంటాడని యేసుప్రభువు చెప్పాడు (లూకా 12:20,21). చావు ఎప్పుడూ మన పక్కనే ఉంటుంది. కాలుజారి క్రిందపడ్డా, తేలు కుట్టినా, పాము కరచినా, యాక్సిడెంట్ అయినా, గట్టిగా ఒక్క తన్ను తన్నినా మనిషి ప్రాణం పోతుంది. అలాంటిది మనిషి బ్రతుకు. ఇలాంటి సెక్యూరిటీ లేని బ్రతుకు బ్రతకటానికి మనిషి పడే పాట్లు చూసి దేవుడు చాలా బాధపడతాడు. ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్త జనులారా! నా యొద్దకు రండి నేను మీకు విశ్రాంతి కలుగుజేస్తాను అని దేవుడు పిలుస్తుంటే ఎవరన్న లెక్క చేస్తున్నారా? కష్టంతో, బాధతో, వేదనతో జీవితాన్ని సాగించడం దేవుని చిత్తం కాదు. జీవితానికి అంతం చావు, ఆ చావు ఎప్పుడు వస్తుందో ఎవరికీ తెలీదు, అయితే దేవున్ని నమ్మిన వారికి దేవుడు నిర్ణయించిన ఆయుష్షు మొత్తం అనుభవిస్తారు. లేకపోతే అర్ధాంతరంగా చస్తారు. మనిషి దేవుని కాపుదల లోనికి తనంతట తానుగా వచ్చినప్పుడు దేవుడు ఆ మనిషికి ఒక కంచె వేస్తాడు (యోబు 1:10). అప్పుడు ఎలాంటి ఆపద ఆ మనిషికి రాదు.

**(ఇంకా వుంది)**

**బైబిల్ క్విజ్**

# పరిశుద్ధ గ్రంథ పరిశోధనా పట్టిక - 1

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | 3 | ■ | 4 | 5 |
| | ■ | | 6 | | | |
| 7 | | | 8 | | | 9 |
| 10 | | | | 11 | ■ | |
| ■ | 12 | | 13 | | 14 | |
| 15 | | ■ | ■ | 16 | | ■ |
| 17 | | | ■ | 18 | 19 | ■ |

**అడ్డం:**

1. అబ్రాహాము రెండవ భార్య (3)
4. -- లను కటాక్షించువాడు ధన్యుడు (2)
6. జీవజలమును గూర్చి యేసుచే బోధింపబడిన స్త్రీ తారుమారు (4)
7. ఇస్సాకు కుమారుడు (3)
8. ఏలీయాను పోషించిన పక్షులు (4) (తిరగబడింది)
10. ప్రవక్తకు మరో పేరు (4) ( 1 సమూ.)
12. ద్రాక్షగెల అను అర్థమిచ్చు మాట (3)
13. పౌలు కుంటివానిని బాగుచేసిన పట్టణము (2)
14. బహుమానము పొందవలెనని -- యొద్దకే పరుగెత్తుచున్నాను - పౌలు (2)
15. బోయజు రూతుకు ఎన్ని కొలల యవలిచ్చెను? (2)
17. శారా దాసియైన ఐగుప్తీయురాలు (3)
18. ఇహలోకమును స్నేహించి పౌలును విడిచి వెళ్ళిన వాడు (2)

**నిలువు:**

1. యోబు రెండవ కుమార్తె (3)
2. యెరికోలో నివసించిన వేశ్య (3)
3. ఈ - - - వారు దుష్ట తరము వారైయుండి సూచకక్రియనడుగుచున్నారు (3)
5. దేవుని - - ఆయన మీద ఉండెను (2)
9. బుద్ధిలేని యొక - - - పనిముట్లను తీసుకొమ్ము (3) (జెకర్యా 11)
11. - - హీనుడు నీకు కనబడినప్పుడు వానికి వస్త్రములిచ్చుటయు ఇదియే గదా నాకిష్టమైన ఉపవాసము (2)
12. లోకము నిన్ను - - - లేదు (3)
15. సిలువ శ్రమల పాట ప్రారంభం (2)
16. పేతురు స్వరమును గుర్తించిన చిన్నది (2)
19. యాపెతు కుమారులలో ఒకరు (3) క్రింద నుండి పైకి (ఆదికాండం)

**గమనిక:-** పరిశుద్ధగ్రంథ పరిశోధనా పట్టిక-1లోని గళ్ళను పూరించి, ఫోటో తీసి 9440217726 నంబరుకు వాట్సాప్ ద్వారా లేదా kerajendra@gmail.com కు ఈ-మెయిల్ ద్వారా పంపగలరు. వాట్సాప్, ఈ-మెయిల్ లేనివారు తెల్లపేపరు మీద లేదా పోస్ట్ కార్డు మీద అడ్డము, నిలువు సమాధానాలు వ్రాసి, ఎడిటర్, హన్నాకృప, 6వ లైను, క్లౌపేట, ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా, ఆం.ప్ర. అను అడ్రసుకు పంపగలరు.